సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in
హైదరాబాద్
శుక్రవారం, 21.08.2026
www.mudranews.in | @mudranews
సంపుటి:13 సంచిక: 291
పేజీలు: 08 వెల: రూ. 5

## వరలక్ష్మీ నమోస్తుతే..

**నేడే వరలక్ష్మీ వ్రతం**



- ఇంటింటా లక్ష్మీ పూజ
- ఏపీ, తెలంగాణలో పాఠశాలలు.. కార్యాలయాలకు ప్రభుత్వ సెలవు
- ఆప్షనల్ హాలిడేగా ఉత్తర్వులు
- నల్గొండ ప్రిన్సిపల్ హత్యకు వ్యతిరేకంగా నేడు బంద్
- మిలాద్ ఉన్ నబీ, రక్షాబంధన్ తో ఈ నెలలో వరుస సెలవులు

02

# కాంగ్రెస్‌పై కొండంత బండ



## కొండా కుటుంబం వర్సెస్ రేవంత్



- కాంగ్రెస్‌లో ముదురుతున్న విభేదాలు
- సుష్మిత ఘాటు వ్యాఖ్యలపై షోకాజ్
- మంత్రి సురేఖను వివరణ కోరిన పీసీసీ
- కొండా కుటుంబం వ్యాఖ్యలతో కాంగ్రెస్‌లో కాక
- సుష్మిత వ్యాఖ్యల వెనుక ఎవరు?

**ముద్ర డెస్క్:**
తెలంగాణ ప్రభుత్వంలో, కాంగ్రెస్ పార్టీలో మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుష్మిత వ్యాఖ్యలు కలకలం రేపుతున్నాయి. గత ఏడాది అక్టోబరులో మేడారం జాతర పనులు తమకు ఇవ్వలేదని సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి లక్ష్యంగా ఆరోపణలు చేసింది. ఆ తర్వాత కొండా సురేఖ క్షమాపణలు చెప్పడంతో ఆ వివాదం టీ కప్పులో తుఫానులా సమసిపోయింది. తాజాగా వరంగల్ జిల్లా పర్యటన నేపథ్యంలో రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మంత్రి కొండా సురేఖ జన్మదిన వేడుకల నేపథ్యంలో



ఆమె కూతురు కొండా సుష్మిత చేసిన వ్యాఖ్యలు మరోసారి వివాదానికి ఆజ్యం పోశాయి. ఈ సారి పూర్తిగా రేవంత్ రెడ్డి లక్ష్యంగా ఉండడం ఉత్కంఠ రేపుతున్నది.

తాజాగా వరంగల్ పర్యటన సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి వచ్చే ఎన్నికల్లో పరకాల నియోజకవర్గం నుండి తిరిగి ప్రస్తుత ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి పోటీ చేస్తారని, ప్రజలు తిరిగి గెలిపించాలని అన్నారు. ఈ వ్యాఖ్యల నేపథ్యంలోనే నిన్న వరంగల్ జిల్లా పరకాల నియోజకవర్గం గీసుకొండలో జరిగిన కొండా సురేఖ జన్మదిన వేడుకలలో కొండా సుష్మిత స్పందించారు. 'వచ్చే ఎన్నికల్లో పరకాల నుండి తానే పోటీ చేస్తానని, యువతకు అవకాశాలు ఇస్తానని చెబుతున్న రేవంత్ రెడ్డి 70 ఏళ్లు పైబడిన రేవూరి ప్రకాష్ రెడ్డికి టికెట్ ఇస్తానని ఎలా చెబుతారని, సంగారెడ్డిలో జగ్గారెడ్డికి టికెట్ ఏఐసీసీ ఇస్తుందన్న రేవంత్ రెడ్డి, ఇక్కడ మాత్రం తాను ఎలా ప్రకటన చేస్తారని ప్రశ్నించింది. గతంలో పీసీసీ అధ్యక్షుడుగా రేవంత్ రెడ్డి ఉండాలని తన తల్లి కొండా సురేఖ, తండ్రి కొండా మురళి ప్రతిపాదించారని, తమ ఇంటికి వచ్చి కాంగ్రెస్ పార్టీకి 34 సీట్లు వస్తే కొండా మురళికి ఎమ్మెల్సీ ఇస్తానని హామీ ఇచ్చారని, ఆ హామీ ఏమైందని ప్రశ్నించింది. సీతా దయాకర్ రెడ్డి ఎవరని ఆమెకు పదవి ఇచ్చారని, బీసీ మంత్రుల ఫోటోలు ప్రకటనలలో ఎందుకు వేయడం లేదని, పొంగులేటి పొంగు ఎంతో సేపు నిలవదని, రేవంత్ రెడ్డి తమ్ముడికి రూ.200 కోట్ల భూమి కట్టబెట్టారని, తన వ్యాఖ్యలకు స్పందిస్తే మరిన్ని అక్రమాలు బయటపెడతానని హెచ్చరించడం గమనార్హం.

అయితే సరిగ్గా ఈ నెల 13న కొండా సురేఖ ఒక ప్రముఖ దినపత్రికలో "పాలించే ప్రభువు కాదు. కలిసి పనిచేసే గుంపుమేస్త్రీ' అంటూ వ్యాసం రాసింది. సరిగ్గా వారం తిరగకముందే కొండా సురేఖ కూతురు మిగతా 02లో





### కళ్యాణలక్ష్మి, షాదీముబారక్‌పై

## సర్కార్‌కు షాక్

**స్టే ఎత్తివేతకు హైకోర్టు నిరాకరణ**

- పథకాలకు చట్టబద్ధత ఏంటని ప్రశ్న
- రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై తీవ్ర వ్యాఖ్యలు
- భూసేకరణ బాధితులపై ప్రభుత్వానికి క్లాస్

**ముద్ర, హైదరాబాద్:**
కళ్యాణలక్ష్మి , షాదీముబారక్ పథకాలపై దాఖలైన పిటిషన్లపై తెలంగాణ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ పథకాల అమలును నిలిపివేస్తూ ఇచ్చిన స్టే ఉత్తర్వులను ఎత్తివేయడానికి ఉన్నత న్యాయస్థానం స్పష్టంగా నిరాకరించింది. 2014 నుంచి అమలవుతున్న ఈ పథకాలకు చట్టబద్ధమైన ఆధారం ఏంటని ప్రశ్నించిన హైకోర్టు, కేవలం ప్రభుత్వ జీవోలతో ప్రజాధనాన్ని ఉచిత పథకాలకు వాడటం ఎంతవరకు సమంజసమని నిలదీసింది. ఒకవైపు ప్రభుత్వ రంగ సంస్థలు, ఇతర కీలక రంగాలు నిధుల కొరత ఎదుర్కొంటుంటే, మరోవైపు రిటైర్డ్ ఉద్యోగులకు జీతాలు, పెన్షన్లు కూడా సమయానికి అందక అనేకమంది తీవ్ర అవస్థలకు గురవు మిగతా 02లో

## సీట్లు తగ్గొద్దు..

# నిధులు తగ్గొద్దు

**డీలిమిటేషన్‌పై దక్షిణాది రాష్ట్రాల ఉమ్మడి డిమాండ్**

- రాజకీయ ప్రాతినిధ్యం తగ్గొద్దు : డీకే డిమాండ్
- కేంద్ర నిధుల్లో న్యాయం చేయాలి
- దక్షిణాది అభివృద్ధికి చంద్రబాబు కీలక ప్రతిపాదనలు
- గోదావరి–కావేరి అనుసంధానంపై చంద్రబాబు ఫోకస్
- బలమైన రాష్ట్రాలే బలమైన భారత్ కు పునాది: సీఎం విజయ్
- రాష్ట్రాల హక్కుల కోసం దక్షిణాది సమిష్టి స్వరం



**ముద్ర , హైదరాబాద్ :**
దక్షిణ మండలి సమావేశం ఈసారి కీలక రాజకీయ, ఆర్థిక అంశాలకు వేదికగా మారింది. డీలిమిటేషన్, కేంద్ర నిధుల పంపకం, రాష్ట్రాల హక్కులు, నదుల అనుసంధానం, అభివృద్ధి, కనెక్టివిటీ వంటి అంశాలపై దక్షిణాది రాష్ట్రాల నేతలు తమ అభిప్రాయాలను బలంగా వినిపించారు. రాష్ట్రాల ప్రత్యేక ప్రయోజనాలతో పాటు కేంద్రం ముందు సమిష్టిగా తమ డిమాండ్లను ఉంచే వేదికగా సమావేశం కనిపించింది. మొత్తంగా సీట్లు తగ్గొద్దు.. నిధులు తగ్గొద్దు.. రాష్ట్రాల హక్కులు తగ్గొద్దు అన్న సందేశం బలంగా వినిపించింది. మిగతా 02లో

### నా కూతురు మాటలతో

## నాకేం సంబంధం

**పీసీసీ నోటీసులపై సురేఖ వివరణ**

- కుమార్తె వ్యాఖ్యలతో నాకు సంబంధం లేదు
- పార్టీ అధిష్ఠానంపై పూర్తి గౌరవం
- నోటీసులను వెనక్కి తీసుకోవాలని విజ్ఞప్తి

03



## బైక్‌పై సజ్జనార్

- కేబీఆర్ వన్‌వేపై సడన్ చెక్.!
- సివిల్ డ్రెస్‌లో క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ
- రెండు సార్లు బైక్‌పై తిరిగిన సీపీ
- నగరవాసులు సహకరించాలని విజ్ఞప్తి

03



### 22ఏ ముసుగులో

## కమీషన్ల దందా?

**ఈ సెక్షన్లు అడ్డు పెట్టుకుని దోపిడీ**

- రేవంత్ సర్కార్ పై హరీశ్ రావు ఫైర్
- బాధ్యులైన మంత్రి పొంగులేటిని బర్తరఫ్ చేయాలి
- తక్షణం చర్యలు తీసుకోవాలని రాహుల్ కి లేఖ

02



### సారీ.. నిన్ను

## పెళ్లి చేసుకోలేను





- చివరి నిమిషంలో హ్యాండ్ ఇచ్చిన పెళ్లికూతురు..!
- ఆగిన మ్యారేజ్ వైరల్
- లబోదిబో అంటున్న పెళ్లి కొడుకు

03



### పెట్టుబడుల వేటలో

## సీఎం రేవంత్

**ఢిల్లీ నుంచి బ్రిటన్‌కు పయనం**

- బ్రిటన్, అమెరికాలో వరుస సమావేశాలు

**ఇదీ AI ముద్ర**



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శుక్రవారం, 21.08.2026
www.mudranews.in | @mudranews



## వరలక్ష్మీ వ్రతంలో కలశం ఏర్పాటు చేయాలి



బియ్యంపై కలశాన్ని ఉంచి, అందులో నీరు, మామిడి ఆకులు, కొబ్బరికాయ ఏర్పాటు చేసి వరలక్ష్మీ అమ్మవారిగా అలంకరించాలి.

## పెట్టుబడుల వేటలో
# సీఎం రేవంత్

**ముద్ర, హైదరాబాద్ :**
10 రోజుల విదేశీ పర్యటన కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బయలుదేరారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం కోసం దిల్లీ వెళ్లిన సీఎం బుధవారం అర్ధరాత్రి తర్వాత అక్కడి నుంచే విదేశాలకు బయల్దేరారు. ఈ నెల 30 వరకు బ్రిటన్, అమెరికాల్లో సీఎం బృందం పర్యటించనుంది. 2 దేశాల్లోని వివిధ యూనివర్సిటీలను సందర్శించి రాష్ట్రంలో ఉన్నత విద్య, క్రీడల అభివృద్ధిపై చర్చించనున్నారు.



**విద్య, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి**
సీఎం రేవంత్ రెడ్డి యూకే, యూఎస్ పర్యటనకు వెళ్లారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం కోసం దిల్లీ వెళ్లిన ముఖ్యమంత్రి అక్కడి నుంచే బుధవారం రాత్రి 12:30 గంటలకు లండన్ వెళ్లారు. ఈ నెల 30 వరకు యూకే, అమెరికాలో సీఎం పర్యటించనున్నారు. ఇందులో ముఖ్యంగా విద్య, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి, అంతర్జాతీయ సంస్థలతో సంబంధాల బలోపేతం వంటి అంశాలపై పలు సమావేశాలు, కార్యక్రమాలు జరగనున్నాయి. రెండు దేశాల్లోని పలు యూనివర్సిటీలను సందర్శించి, అధికారులతో చర్చిస్తారు. లండన్‌లోని ఆక్స్‌ఫర్డ్ వర్సిటీలోని బ్లావట్నిక్ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్‌ను సీఎం సందర్శించనున్నారు. అక్కడి ఎమిరేట్స్ స్టేడియంలో ఫుట్‌బాల్ ప్రజెంటేషన్‌లో పాల్గొననున్నారు.

**అమెరికాలోని బోస్టన్‌కు**
22న లండన్‌లో కేంబ్రిడ్జ్ బృందంతో ముఖ్యమంత్రి సమావేశం కానున్నారు. ఆ రోజు ఉదయం యూనివర్సిటీ ఆఫ్ లండన్ క్యాంపస్‌లోని సెనెట్ హౌస్‌ను సందర్శిస్తారు. ఆ తర్వాత సాయంత్రం 4 గంటలకు లండన్ బిజినెస్ స్కూల్‌కు వెళ్తారు. ఈ నెల 23న లండన్ నుంచి అమెరికాలోని బోస్టన్‌కు బయలుదేరతారు. ఈ నెల 24న బోస్టన్‌లోని ప్రఖ్యాత హార్వర్డ్ యూనివర్సిటీ క్యాంపస్‌ను సందర్శిస్తారు. అనంతరం సాయంత్రం ఎంఐటీ క్యాంపస్‌కు వెళ్తారు.

**ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్**
ఈ నెల 25న ఉదయం బోస్టన్‌లో నార్త్ ఈస్టర్న్ క్యాంపస్‌ను సందర్శిస్తారు. ఆరోజు సాయంత్రం వర్జీనియా టెక్ యూనివర్సిటీ బృందంతో సమావేశం అవుతారు. తర్వాత రాత్రి బోస్టన్ నుంచి న్యూయార్క్ సిటీకి సీఎం వెళ్లనున్నారు. ఈ నెల 26న న్యూయార్క్‌లో ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ నిర్వహించే మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో పాల్గొంటారు. ఈ నెల 29న న్యూయార్క్ నుంచి బయలుదేరి 30న హైదరాబాద్‌కు చేరుకుంటారు.

## కళ్యాణలక్ష్మి, షాదీముబారక్‌పై
# సర్కార్‌కు షాక్

(మొదటి పేజీ తరువాయి)
తున్నారని వ్యాఖ్యానించింది. రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితులు డేంజర్ బెల్స్ మోగిస్తున్నాయని ఈ సందర్భంగా హెచ్చరించింది. ప్రజాపన్నుల ద్వారా వచ్చిన సొమ్మును ఉచిత పథకాలకు వెచ్చించే కంటే, ఆర్టీసీ వంటి ప్రభుత్వ రంగ సంస్థలను లాభాల్లోకి తీసుకువచ్చి ఆ రాబడితో సంక్షేమ కార్యక్రమాలు చేపట్టవచ్చు కదా అని ధర్మాసనం సూచించింది. భూసేకరణలో భూములు కోల్పోయిన బాధితులకు నష్టపరిహారం చెల్లించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని, బాధితులు ఏండ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరుగుతున్నారని తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. దీనిపై తప్పుడు అఫిడవిట్ సమర్పించడంపైనా న్యాయస్థానం క్లాస్ తీసకుంది. ఈ పథకాల చట్టబద్ధత, బడ్జెట్ కేటాయింపులపై స్పష్టమైన వివరణ కావాలని ఆదేశిస్తూ, తదుపరి విచారణను సోమవారానికి వాయిదా వేసింది.




## 22ఏ ముసుగులో
# కమీషన్ల దందా?

**ముద్ర, హైదరాబాద్ :**
తెలంగాణ రాజకీయాల్లో 22A రిజిస్ట్రేషన్ల వ్యవహారం తీవ్ర కలకలం రేపుతోంది. నిషేధిత జాబితా నుంచి ఆస్తుల తొలగింపు ప్రక్రియలో భారీ ఎత్తున అక్రమాలు జరుగుతున్నాయనే విమర్శల నడుమ, ప్రతిపక్ష బీఆర్ఎస్ నాయకుడు హరీశ్ రావు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి నేరుగా లేఖ రాయడం రాష్ట్రంలో పెద్ద చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వంపై నేరుగా దాడులు పెంచుతున్న బీఆర్ఎస్, ఈ వ్యవహారంలో కీలక మంత్రి పాత్ర ఉందంటూ ఆరోపణలు గుప్పించింది.
నిషేధిత జాబితా కింద ఉన్న భూములు , ఆస్తులను తొలగించి, వాటికి సులభంగా రిజిస్ట్రేషన్ అనుమతులు కల్పించే క్రమంలో భారీగా కమిషన్లు దండుకుంటున్నారని హరీశ్ రావు తన లేఖలో పేర్కొన్నారు. ఈ ప్రక్రియ కోసం దళారులు, అధికారులు కలసి మార్కెట్ విలువలో ఏకంగా 30 శాతం వరకు కమీషన్లను డిమాండ్ చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పర్యవేక్షణలోనే ఈ వ్యవహారం నడుస్తోందని, అందువల్ల ఆయనను తక్షణమే మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని రాహుల్ గాంధీని డిమాండ్ చేశారు.
ఇంత పెద్ద ఎత్తున అవినీతి చోటుచేసుకుంటున్నా మరియు బహిరంగంగా ఆరోపణలు వస్తున్నా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పట్ల హరీశ్ రావు తీవ్ర అభ్యంతరం తెలిపారు. ప్రభుత్వం చూసీ చూడనట్లు వ్యవహరించడం కాంగ్రెస్ పార్టీ వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు. ఒక వైపు పారదర్శక పాలన అందిస్తామని చెప్తూ, మరోవైపు ఇటువంటి కుంభకోణాలను ప్రోత్సహించడం ప్రజలను మోసం చేయడమేనని లేఖలో స్పష్టం చేశారు.

**రాహుల్ గాంధీ జోక్యానికి డిమాండ్**
పార్టీలో అవినీతికి చోటులేదని నిలదీసే రాహుల్ గాంధీ, తెలంగాణలో జరుగుతున్న ఈ 22A భూముల అక్రమాలపై వెంటనే స్పందించాలని బీఆర్ఎస్ డిమాండ్ చేస్తోంది. కాంగ్రెస్ పార్టీ కేంద్ర నాయకత్వం ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించి, బాధ్యులైన మంత్రిపై కఠిన చర్యలు తీసుకునేలా మార్గదర్శకాలు ఇవ్వాలని లేఖ ద్వారా కోరారు. రాబోయే రోజుల్లో ఈ అంశంపై మరింత స్థాయిలో పోరాటం చేస్తామని బీఆర్ఎస్ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.




# సీట్లు తగ్గొద్దు.. నిధులు తగ్గొద్దు



(మొదటి పేజీ తరువాయి)
జనాభా నియంత్రణలో ముందున్న దక్షిణాది రాష్ట్రాలకు డీలిమిటేషన్ కారణంగా రాజకీయంగా నష్టం జరగకూడదన్న అభిప్రాయం సమావేశంలో ప్రధానంగా వ్యక్తమైంది. కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ 1971 జనాభా లెక్కలను ప్రాతిపదికగా కొనసాగించాలని కోరారు. ప్రస్తుత లోక్‌సభలోని 543 స్థానాలను యథాతథంగా కొనసాగిస్తూ, అదే స్థానాల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలని ప్రతిపాదించారు. జనాభా నియంత్రణను విజయవంతంగా అమలు చేసిన రాష్ట్రాల పార్లమెంటరీ ప్రాతినిధ్యం తగ్గితే అన్యాయం జరుగుతుందని డీకే శివకుమార్ పేర్కొన్నారు. ఆర్థిక ప్రాధాన్యానికి తగ్గట్టుగానే రాజకీయ ప్రాతినిధ్యం ఉండాలని ఆయన అభిప్రాయపడ్డారు. తమిళనాడు రాజకీయ నేత విజయ్ కూడా పార్లమెంటులో దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గకుండా చట్టబద్ధమైన హామీ అవసరమని డిమాండ్ చేశారు.

**నిధుల పంపకంపై దక్షిణాది గళం**
ఆర్థిక సంఘం నిధుల పంపకంలో దక్షిణాది రాష్ట్రాలకు న్యాయం చేయాలన్న డిమాండ్ కూడా సమావేశంలో ప్రధానంగా వినిపించింది. 15వ ఆర్థిక సంఘం సమయంలో కర్ణాటక వాటా 4.7 శాతం నుంచి 3.6 శాతానికి తగ్గిందని డీకే శివకుమార్ వెల్లడించారు. దీంతో ఆరేళ్లలో రాష్ట్రానికి సుమారు రూ.65 వేల కోట్ల నష్టం జరిగిందని ఆయన ఆరోపించారు. కర్ణాటకకు సిఫారసు చేసిన రూ.5,495 కోట్ల ప్రత్యేక గ్రాంటు విడుదల కాలేదని, మరో రూ.6 వేల కోట్ల రాష్ట్ర ప్రత్యేక గ్రాంటు కూడా అందలేదని డీకే పేర్కొన్నారు. 16వ ఆర్థిక సంఘంలో కర్ణాటక వాటా 4.131 శాతానికి పెరిగినప్పటికీ, తమ వాటాను తిరిగి 4.7 శాతానికి పెంచాలని రాష్ట్రం కోరుతోంది.

**కావేరిపై భిన్న స్వరాలు**
నీటి సమస్యలపై దక్షిణాది రాష్ట్రాల మధ్య భిన్న అభిప్రాయాలు కూడా సమావేశంలో స్పష్టమయ్యాయి. నీటి పంపకాల వివాదాల నుంచి నీటి సహకారం వైపు వెళ్లాల్సిన అవసరం ఉందని డీకే శివకుమార్ అన్నారు. సమానత్వం, పారదర్శకత, పరస్పర సహకారంతో నీటి సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. కావేరి, కృష్ణా, తుంగభద్ర, పెన్నా, పాలార్ వంటి నదులు దక్షిణాది ప్రజల జీవనాడులని పేర్కొన్న ఆయన.. కృష్ణా, అప్పర్ భద్ర, నదుల అనుసంధానం వంటి అంశాలపై కర్ణాటక తన వైఖరిని స్పష్టం చేస్తుందని తెలిపారు. మరోవైపు కావేరి జలాల విషయంలో సుప్రీంకోర్టు తీర్పులు, సంబంధిత అథారిటీల నిర్ణయాలను అమలు చేయాలని తమిళనాడు సీఎం విజయ్ డిమాండ్ చేశారు. ముల్లెపెరియార్ జలాశయం నీటిమట్టాన్ని 152 అడుగులకు పెంచే విషయంలోనూ కోర్టు తీర్పులకు కట్టుబడి ఉండాలని ఆయన స్పష్టం చేశారు.

**అభివృద్ధి, కనెక్టివిటీపై ఫోకస్**
ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాత్రం దక్షిణాది అభివృద్ధి, మౌలిక సదుపాయాలు, కనెక్టివిటీ, నదుల అనుసంధానంపై ప్రధానంగా దృష్టి పెట్టారు. ఏపీ–కర్ణాటక–తమిళనాడు రాష్ట్రాలను అనుసంధానించే బుల్లెట్ ట్రైన్ ప్రతిపాదనను ఆయన ముందుకు తెచ్చారు. కుప్పం మీదుగా అమరావతి–బెంగళూరు–చెన్నై రవాణా కారిడార్ అభివృద్ధి చేయాలని సూచించారు. దక్షిణాది రాష్ట్రాల ఉమ్మడి లాజిస్టిక్స్ నెట్‌వర్క్, డ్రైపోర్టుల ఏర్పాటు, దక్షిణాది విద్యుత్ గ్రిడ్‌ను జాతీయ గ్రిడ్‌తో అనుసంధానం చేయడం వంటి ప్రతిపాదనలు చేశారు. రాష్ట్రాల యూనివర్సిటీలు, స్కిల్లింగ్ సంస్థలతో ఉమ్మడి కన్సార్టియం ఏర్పాటు చేయాలని, విపత్తుల సమయంలో పరస్పర సహకారం కోసం మ్యూచువల్ ఎయిడ్ ఫోర్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. తిరుపతి నుంచి కాశీ, అయోధ్య, చార్‌ధామ్ వరకు ఉమ్మడి ఆధ్యాత్మిక పర్యాటక సర్క్యూట్ అభివృద్ధి చేయాలని చంద్రబాబు ప్రతిపాదించారు. 2047 నాటికి దక్షిణాది ఆర్థిక వ్యవస్థ 10 ట్రిలియన్ డాలర్ల స్థాయికి చేరే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు.

**ఏపీ ప్రయోజనాలపైనా బాబు దృష్టి**
దక్షిణాది ఉమ్మడి అంశాలతో పాటు ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన పెండింగ్ సమస్యలను కూడా చంద్రబాబు కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. విభజన చట్టంలోని షెడ్యూల్ 9, 10 సంస్థల విభజన సమస్యలను పరిష్కరించాలని కోరారు. 12 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న రాష్ట్ర విభజన సమస్యలపై కేంద్రం వేగంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పోలవరం, సౌత్ కోస్ట్ రైల్వే జోన్, అమరావతి ప్రాజెక్టులకు కేంద్ర సహకారం అవసరమని పేర్కొన్నారు. దుగ్గరాజపట్నం పోర్టు, రిఫైనరీకి త్వరగా అనుమతులు ఇవ్వాలని కోరారు. విశాఖ, విజయవాడ మెట్రో ప్రాజెక్టులకు కేంద్ర అనుమతులు ఇవ్వాలని, కడప జేఎస్‌డబ్ల్యూ రైల్వే లింక్‌కు అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

**గోదావరి–కావేరి అనుసంధానం..**
దక్షిణాది జల సమస్యలకు పరిష్కారంగా నదుల అనుసంధానంపై చంద్రబాబు మరోసారి దృష్టి సారించారు. గోదావరి–కావేరి అనుసంధానం ద్వారా 500 టీఎంసీలకు పైగా నీటిని మళ్లించే ప్రతిపాదనను ప్రస్తావించారు. తమిళనాడు నీటి సమస్యకు దీర్ఘకాలిక పరిష్కారంగా నదుల అనుసంధానాన్ని పరిశీలించాలని సూచించారు. ఏపీ, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలు జలాల విషయంలో సమన్వయంతో ముందుకు వెళ్లాలని కోరారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని గంగా–కావేరి అనుసంధానానికి దీర్ఘకాలిక జాతీయ ప్రణాళిక అవసరమని చంద్రబాబు అభిప్రాయపడ్డారు.

**కేంద్ర నిధులపై కేరళ అసంతృప్తి**
కేరళ కూడా కేంద్ర నిధుల పంపకం, తీర రక్షణ, ఆఫ్‌షోర్ మైనింగ్ అంశాలను సమావేశంలో ప్రస్తావించింది. ఆయుష్మాన్ భారత్ పథకం కింద రాష్ట్రం భారీగా ఖర్చు చేస్తున్నప్పటికీ కేంద్రం నుంచి తగినంత నిధులు రావడం లేదని కేరళ అసంతృప్తి వ్యక్తం చేసింది. రూ. 1,493 కోట్లు ఖర్చు చేస్తే కేంద్రం కేవలం రూ. 151 కోట్లు మాత్రమే ఇచ్చిందని ఆ రాష్ట్రం పేర్కొంది. కేరళ తీర ప్రాంతంలో 63 శాతం మేర కోతకు గురవుతోందని ఆందోళన వ్యక్తం చేసింది. తీర రక్షణ కోసం NDRF, SDRF నిధులను వినియోగించుకునేందుకు అనుమతి ఇవ్వాలని కోరింది. శాస్త్రీయ అధ్యయనాలు, సరైన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ లేకుండా ఆఫ్‌షోర్ మైనింగ్ బ్లాకుల వేలం నిర్వహించవద్దని డిమాండ్ చేసింది. మైనింగ్ వల్ల తీర ప్రాంత పర్యావరణానికి ముప్పు ఏర్పడే అవకాశం ఉందని హెచ్చరించింది.

**దక్షిణాది రాష్ట్రాల సమిష్టి స్వరం**
డీలిమిటేషన్, ఆర్థిక సంఘం నిధులు, నీటి పంపకాలు, రాష్ట్రాల హక్కులు వంటి అంశాల్లో రాష్ట్రాల మధ్య అభిప్రాయ భేదాలు ఉన్నప్పటికీ.. కేంద్రంతో సంబంధించి తమ ప్రయోజనాల విషయంలో దక్షిణాది రాష్ట్రాలు సమిష్టిగా గళం వినిపించాయి. మరోవైపు డ్రగ్స్, అంతర్రాష్ట్ర నేరాల నియంత్రణకు రియల్‌టైమ్ ఇంటెలిజెన్స్ షేరింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలన్న సూచన కూడా వచ్చింది. మొత్తంగా చెన్నైలో జరిగిన దక్షిణ మండలి సమావేశం కేవలం రాష్ట్రాల సమస్యల చర్చకే పరిమితం కాకుండా.. దక్షిణాది రాజకీయ ప్రాతినిధ్యం, ఆర్థిక హక్కులు, అభివృద్ధి, నీటి వనరులు, కనెక్టివిటీ వంటి అంశాలపై భవిష్యత్‌లో సమిష్టి వ్యూహానికి వేదికగా మారే సంకేతాలను ఇచ్చింది.

# కాంగ్రెస్‌పై కొండంత బండ



(మొదటి పేజీ తరువాయి)
ఇంత ఘాటు వ్యా ఖ్యలు చేయడం వెనక కారణం ఏం టన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఇదే సమయంలో కాంగ్రెస్ సీనియర్లు దయాసాగర్, షబ్బీర్ అలీలను ప్రస్తావించడంతో పాటు, మంత్రులు పొన్నం ప్రభాకర్, ఉత్తమ్ కుమార్ రెడ్డిల గురించి ప్రస్తావించడం అనుమానాలకు తావిస్తుంది. ఎలాంటి చర్చ లేకుండా కొండా సుష్మిత ఇలాంటి ఘాటు వ్యాఖ్యలు చేసే అవకాశం లేదని, ఖచ్చితంగా తెరవెనక జరుగుతున్న దానికి అనుగుణంగానే తెర ముందు సుష్మిత ఇలాంటి వ్యాఖ్యలు చేసిందని కాంగ్రెస్ వర్గాలు అంటున్నాయి. అసలు కాంగ్రెస్, పచ్చ కాంగ్రెస్ అనే వ్యాఖ్యలు కూడా వ్యూహాత్మకమేనని, రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా కాంగ్రెస్ సీనియర్లు కొండా కుటుంబాన్ని ముందు పెట్టి మాట్లాడిస్తున్నారని అంటున్నారు. కొద్ది రోజుల క్రితమే కొండా మురళి తన కూతురు వచ్చే ఎన్నికల్లో పరకాల నుండి పోటీ చేస్తుందని, రాబోయే 20 ఏళ్లు తనే ఎమ్మెల్యే అని ప్రకటించారు. దానికి భిన్నంగా రేవంత్ స్పందించిన నేపథ్యంలో దమ్ముంటే ఇప్పుడే రేవూరి ప్రకాష్ రెడ్డితో రాజీనామా చేయించి రేవంత్ రెడ్డి అతడికి మద్దతుగా ప్రచారం చేయాలని, తాను స్వతంత్రంగా పోటీ చేసి గెలుస్తానని సుష్మిత సవాల్ విసిరింది.
ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ సంఘం బుధవారం రాత్రి కొండా సుష్మిత వ్యాఖ్యలపై వివరణ ఇవ్వాలని షోకాజ్ నోటీసులు ఇచ్చింది. అనంతరం మంత్రి సురేఖను వివరణ ఇవ్వాలని కోరింది. దీంతో వివాదం ముదిరింది. మరో వైపు పది రోజుల విదేశీ పర్యటన నిమిత్తం సీఎం రేవంత్ రెడ్డి అమెరికా, బ్రిటన్ దేశాల సందర్శనకు బయలుదేరారు. ఈ లోపు తెలంగాణలోని కాంగ్రెస్ రాజకీయాలు ఏ మలుపులు తిరుగుతాయో అని అందరూ ఆసక్తిగా గమనిస్తున్నారు. కొండా కుటుంబం చేస్తున్న వ్యాఖ్యలు వారి వ్యక్తిగతమా ? లేక పార్టీలోని కొందరు సీనియర్లు ఆడిస్తున్న ఆటనా అనేది తేలాల్సి ఉంది.

# వరలక్ష్మీ నమోస్తుతే..

**ముద్ర డెస్క్ :**
తెలుగు రాష్ట్రాల్లో పండుగ వాతావరణం నెలకొంది. నేడు వరలక్ష్మీ వ్రతాన్ని మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నారు. ఇంటింటా లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు చేసి, వ్రతాలు ఆచరించనున్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలు పాఠశాలలు, కార్యాలయాలకు సెలవు ప్రకటించాయి. అయితే కొన్ని చోట్ల దీనిని ఆప్షనల్ హాలిడేగా అమలు చేయనున్నట్లు ఉత్తర్వులు జారీ అయ్యాయి. మరోవైపు నల్గొండ ప్రిన్సిపల్ హత్య ఘటనకు నిరసనగా నేడు బంద్‌కు పిలుపునిచ్చారు. దీంతో పలు ప్రాంతా ల్లో విద్యా సంస్థలు, వ్యాపార సంస్థలపై బంద్ ప్రభావం కనిపించే అవకాశం ఉంది.
ఇక ఈ నెలలో వరుసగా పండుగలు, సెలవులు రానున్నాయి. వరలక్ష్మీ వ్రతం తర్వాత మిలాద్ ఉన్ నబీ, రక్షాబంధన్ వంటి పండుగలు ఉండటంతో ప్రజలకు వరుస సెల వులు కలిసి రానున్నాయి. దీంతో కుటుంబాలతో కలిసి పండుగలను జరుపుకునేందుకు, సొంతూళ్లకు వెళ్లేందుకు చాలా మంది ప్లాన్ చేసుకుంటున్నారు.
పండుగలు, సెలవులతో ఈ నెలలో



ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, విద్యాసంస్థల్లో సందడి నెలకొంది.

## ఫిలిప్పీన్స్ విదేశాంగ కార్యాలయాన్ని సందర్శించిన రాష్ట్ర ఎన్ఆర్ఐ అడ్వైజరీ కమిటీ బృందం

**ముద్ర డెస్క్:**
ఫిలిప్పీన్స్ దేశ రాజధాని మనీలా లోని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ కార్యాలయాన్ని తెలంగాణ రాష్ట్ర ఎన్నారై అడ్వైజరీ కమిటీ సభ్యుల బృందం గురువారం సందర్శించింది. విదేశాంగ శాఖ అధికారులతో విస్తృత స్థాయిలో చర్చలు జరిపింది. ఫిలిప్పీన్స్ దేశం విదేశాలలో పనిచేసే ప్రవాసుల కోసం అమలు చేస్తున్న పలు సంక్షేమ కార్యక్రమాలను అత్యుత్తమ విధానాలను తెలంగాణ బృందానికి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. బృందానికి సారథ్యం వహిస్తున్న కమిటీ ఛైర్మన్ డా. బిఎం వినోద్ కుమార్, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్ భూపతి రెడ్డి గల్ఫ్ కార్మికులకు ఎలా అండగా ఉండాలి అన్న అంశాలపై ఫిలిప్పీన్స్ అధికారులతో విపులంగా చర్చించారు. ఫిలిప్పీన్స్ దేశంలో అమలు చేస్తున్న వలస కార్మికుల విధానాన్ని, తెలంగాణ రాష్ట్రం నుంచి గల్ఫ్ దేశాల్లో నివాసం ఉంటున్న సుమారు 15 లక్షల మంది కార్మికులకు అండగా ఉండేందుకు త్వరలో ఒక విధానాన్ని రూపొందించే విధంగా చర్యలు తీసుకుంటామని శ్రీనివాస్, డాక్టర్ భూపతి తెలిపారు. ఫిలిప్పీన్స్ దేశ పర్యటనలో భారత విదేశాంగ శాఖ ఫస్ట్ సెక్రటరీ నీలేష్ కుమార్ రాయ్ బృందానికి సహకారాన్ని అందించారు.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శుక్రవారం 21.08.2026
www.mudranews.in | @mudranews



## గణపతి పూజ చేయాలి

వరలక్ష్మీ పూజకు ముందు వినాయకుడిని పూజించి విఘ్నాలు తొలగాలని ప్రార్థించడం సంప్రదాయంగా వస్తోంది.



# చిత్రపురి కాలనీలో ఘనంగా మెగా రక్తదాన శిబిరం

**- మెగాస్టార్ చిరంజీవి జన్మదినాన్ని పురస్కరించుకుని రక్తదానం..**
**- సినీ కార్మికుల సేవా స్ఫూర్తికి నిదర్శనం**
**-వల్లభనేని అనిల్‌కుమార్, పీఎస్ఎన్ దొర ఆధ్వర్యంలో నిర్వహణ**






**ముద్ర, హైదరాబాద్** : సినీ కార్మికుల పక్షపాతి, మెగాస్టార్ చిరంజీవి జన్మదినాన్ని పురస్కరించుకుని చిత్రపురి కాలనీలో మెగా రక్తదాన శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు. చిత్రపురి కాలనీ ఎల్ఐజీ ప్రాంతంలో వల్లభనేని అనిల్‌కుమార్, పీఎస్ఎన్ దొర ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి సినీ పరిశ్రమకు చెందిన పలువురు ప్రముఖులు, కళాకారులు, కార్మికులు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై రక్తదానం చేశారు.

మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజును కేవలం వేడుకగా కాకుండా సామాజిక సేవాకార్యక్రమంగా నిర్వహించాలనే ఉద్దేశంతో ఈ మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తం అందక ఎంతోమంది ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో రక్తదానం చేయడం ద్వారా ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని, అందుకే చిరంజీవి జన్మదిన వేడుకలకు సేవా కార్యక్రమాన్ని జోడించినట్లు పేర్కొన్నారు. సినీ కార్మికుల సంక్షేమమే ప్రధాన లక్ష్యంతెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షులు, చిత్రపురి కాలనీ మాజీ అధ్యక్షులు వల్లభనేని అనిల్‌కుమార్ మాట్లాడుతూ సినీ పరిశ్రమ అభివృద్ధిలో కార్మికుల పాత్ర ఎంతో కీలకమన్నారు. చిత్రపరిశ్రమలో పనిచేసే ప్రతి ఒక్కరి సంక్షేమం కోసం నిరంతరం కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. మెగాస్టార్ చిరంజీవి సినీ కార్మికుల పట్ల ఎప్పటికప్పుడు ప్రత్యేకమైన అభిమానాన్ని, ఆప్యాయతను చూపించారని, ఆయన జన్మదినాన్ని పురస్కరించుకుని రక్తదాన శిబిరం నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.

**పీఎస్ఎన్ దొర ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం**

చిత్రపురి కాలనీ, ఫిల్మ్ ఫెడరేషన్ మాజీ సెక్రటరీ పీఎస్ఎన్ దొర మాట్లాడుతూ సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు నిర్వహించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా నిర్వహించిన రక్తదాన శిబిరానికి సినీ రంగానికి చెందిన వారు, అభిమానులు, స్థానికులు పెద్ద సంఖ్యలో స్పందించడం అభినందనీయమన్నారు.

సినీ ప్రముఖుల సందడిఈ కార్యక్రమానికి ప్రముఖ సినీ నటుడు హీరో శ్రీకాంత్‌తో పాటు సినీ రంగానికి చెందిన ప్రముఖులు హాజరై రక్తదాతలను అభినందించారు. అలాగే చిరంజీవి కుటుంబానికి చెందిన సుస్మిత, నిహారిక తదితరులు కార్యక్రమంలో పాల్గొని సేవా కార్యక్రమానికి తమ మద్దతు తెలిపారు. మెగాస్టార్ చిరంజీవి జన్మదినం సందర్భంగా నిర్వహించిన ఈ రక్తదాన శిబిరానికి అభిమానుల నుంచి విశేష స్పందన లభించింది.

**సేవా కార్యక్రమాలకు చిత్రపురి కాలనీ వేదిక**

సినీ పరిశ్రమకు చెందిన వేలాది మంది కార్మికులు, కళాకారులకు చిత్రపురి కాలనీ ఒక ముఖ్యమైన నివాస ప్రాంతంగా ఉంది. ఇక్కడ సామాజిక, సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా సినీ కార్మికుల మధ్య ఐక్యతను మరింత బలోపేతం చేయవచ్చని నిర్వాహకులు తెలిపారు.

సినీ కార్మికుల సంక్షేమం, సమాజ సేవ, మానవతా విలువలను ముందుకు తీసుకెళ్లే కార్యక్రమాలకు ఎల్లప్పుడూ తమ సహకారం ఉంటుందని వల్లభనేని అనిల్‌కుమార్, పీఎస్ఎన్ దొర తెలిపారు.

# సారీ.. నిన్ను పెళ్లి చేసుకోలేను

**- చివరి నిమిషంలో హ్యాండ్ ఇచ్చిన పెళ్లికూతురు..!**
**- ఆగిన మ్యారేజ్**
**- పెళ్లి కొడుకు లబోదిబో..**



**ముద్ర, కడప న్యూస్ :** సారీ.. నిన్ను పెళ్లి చేసుకుంటే మా అమ్మ చనిపోతానంటుంది అని ఓ పెళ్లికూతురు హ్యాండ్ ఇవ్వడంతో చివరి నిమిషంలో పెళ్లి ఆగిపోయింది. వివరాల్లోకి వెళ్తే.. . ఏపీలోని వైఎస్ఆర్ కడప జిల్లా పులివెందుల పశుసంవర్ధక శాఖలో ఉద్యోగం చేస్తున్న కడపకు చెందిన యువతికి వేంపల్లె మండలంలోని ఓ గ్రామానికి చెందిన ప్రసాద్ అనే వ్యక్తితో ఏడాది క్రితం పరిచయం ఏర్పడింది. తనకంటే వయసులో చిన్న వాడైన ప్రసాద్‌ను పెళ్లి చేసుకునేందుకు సదరు యువతి సిద్ధపడింది. ఈ క్రమంలో రైతులకు ఇవ్వాల్సిన పశువుల దాణా రెండు బస్తాలు ఎక్కువ ఇచ్చేసరికి, కాబోయే కోడలు చాలా మంచిదని మురిసిపోయిన ప్రసాద్ తల్లిదండ్రులు. బుధవారం ఉదయం ఇద్దరికీ పెద్దలు పెళ్లి నిశ్చయించారు. నాలుగు రోజుల క్రితం హైదరాబాద్ వచ్చి రూ.1.50 లక్షలతో ఇరువురు పెళ్లి బట్టలు కూడా కొనుగోలు చేశారు. ప్రసాద్ కుటుంబ సభ్యులు వారం రోజుల నుంచి వీధిలో షామియానా, ఇంటికి లైట్లు వేసి, వాడలో అందరికీ భోజనాలు పెట్టి పెళ్లి వేడుకలు ఘనంగా చేసుకున్నారు.అయితే పెళ్లి ముహూర్తం రోజు మండపానికి ఎప్పుడు వస్తుందో కనుక్కుందామని యువతికి ఫోన్ చేయగా స్పందించలేదు. దీంతో భయపడ్డ ప్రసాద్ కుటుంబ సభ్యులు పదేపదే ఫోన్ చేయగా.. "సారీ" అని మెసేజ్ చేసింది. చివరికి ఫోన్ లిఫ్ట్ చేసి.. నిన్ను పెళ్లి చేసుకుంటే మా అమ్మ చనిపోతానంటుంది అని చెప్పి ఫోన్ స్విచ్ ఆఫ్ చేసింది. పెళ్లి చేసుకుంటానని నమ్మించి రూ.10 లక్షలు ఖర్చు చేయించిందని, న్యాయం చేయాలని బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. కాగా, సదరు యువతి గతంలో కూడా ఇలాగే రెండు పెళ్లిళ్లు చేసుకుని డబ్బులు వసూలు చేసిందని, ప్రసాద్ బాబాయి కొడుకు నుంచి కూడా రూ.40 వేలు ఖర్చు చేయించిందని పోలీసులు గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## హైదరాబాద్‌లో జనసేన ఎంపీ కుమారుడిపై కేసు




**ముద్ర, హైదరాబాద్**: జనసేన ఎంపీ లింగమనేని రమేశ్ కుమారుడు సంజూష్‌పై హైదరాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈనెల 16న ఇనార్బిట్ మాల్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో భారతి (26) అనే యువతి మృతిచెందింది. ఇనార్బిట్ మాల్‌లోని లైఫ్‌స్టైల్ స్టోర్‌లో పనిచేస్తున్న ఆమె.. రోడ్డు దాటుతుండగా సంజూష్ అతివేగంగా కారు నడుపుతూ ఆమెను ఢీకొట్టినట్లు పోలీసులు గుర్తించారు. దీంతో అతడిపై బీఎన్ఎస్ సెక్షన్ 106(1) కింద కేసు నమోదు చేశారు.

## మల్కాజిగిరి రైల్వే అభివృద్ధిపై ఈటల కీలక సూచనలు

**ముద్ర, హైదరాబాద్:** సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో జరిగిన దక్షిణ మధ్య రైల్వే పార్లమెంట్ సభ్యుల వార్షిక సమావేశంలో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ పాల్గొన్నారు. నియోజకవర్గంలోని రైల్వే స్టేషన్ల ఆధునీకరణ, RUB, ROB, FOB పనులపై రైల్వే ఉన్నతాధికారులతో చర్చించారు. ఫతేనగర్‌లో తరచూ ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో వెంటనే ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని కోరారు. నియోజకవర్గంలో జరుగుతున్న 24 RUB, ROB పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. మేడ్చల్, మల్కాజిగిరి రైల్వే స్టేషన్ల ఆధునీకరణ, ఎంఎంటీఎస్ విస్తరణ, ఆనంద్‌బాగ్, అల్వాల్ వెంకటాపురంలో కొత్త స్టేషన్ల ఏర్పాటుపై కూడా ప్రస్తావించారు. యాదగిరిగుట్ట వరకు ఎంఎంటీఎస్‌ను కేంద్ర నిధులతో విస్తరించే ఆలోచన ఉందన్నారు. రైల్వే అభివృద్ధి పనులకు రాష్ట్ర ప్రభుత్వం సహకరించాలని ఈటల రాజేందర్ విజ్ఞప్తి చేశారు.

## మంత్రి కొండా సురేఖ మాజీ ఓఎస్డీపై కేసు నమోదు

**ముద్ర, హైదరాబాద్**: తెలంగాణ మంత్రి కొండా సురేఖ మాజీ ఓఎస్డీ సుమంత్‌పై కేసు నమోదైంది. సుమంత్ తనను బెదిరించి రూ.10 కోట్లు డిమాండ్ చేశారని ఓ వ్యాపారి ఫిర్యాదు చేశారు. డబ్బులు ఇవ్వనందుకు తనపై దాడి చేశారని అందులో పేర్కొన్నారు. దీంతో సుమంత్‌తో పాటు మరో ఐదుగురిపై పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. మొదట మేడిపల్లి పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి జూబ్లీహిల్స్ పీఎస్‌కు బదిలీ చేశారు.

# కృష్ణ జలాలతో హుజూర్ నగర్ సస్యశ్యామలం చేస్తా..



**ముద్ర, హైదరాబాద్ :** సూర్యాపేట జిల్లా హుజూర్నగర్ నియోజకవర్గం లో మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి సుడిగాలి పర్యటన చేశారు. హైదరాబాద్ నుండి ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా చింతలపాలెం మండలంలోని పాత వెల్లటూరుకు చేరుకొని 1600 కోట్ల రూపాయలతో నిర్మిస్తున్న మహాత్మా గాంధీ ముత్యాల బ్రాంచ్ కెనాల్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ లిఫ్ట్ ఇరిగేషన్ పథకం ఈ ప్రాంతానికి సంబంధించిన రైతుల కోసం కడుతున్నట్లు దాదాపు 53 వేల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు.

డిసెంబర్ నాటికి ప్రాజెక్టు పనులు పూర్తయి అందుబాటులోకి వస్తుందని ఈ ప్రాజెక్టు వల్ల ఈ ప్రాంతంలోని మూడు మండలాల రైతులకు లబ్ధి చేకూరుతుందని పంటలతో ఈ ప్రాంతమంతా సస్యశ్యామలమవుతుందని తెలిపారు. అనంతరం మఠంపల్లి మండలం అల్లిపురం లో 12 కోట్లతో నిర్మిస్తున్న ఆర్ అండ్ బి రోడ్డుకు శంకుస్థాపన చేశారు. అక్కడనుండి పాలకవీడు మండలంలో 1.43 కోట్లతో నిర్మించిన ప్రైమరీ హెల్త్ సెంటర్ భవనాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలోని ప్రజలందరికి ఉపయోగపడేలా ఈ హెల్త్ సెంటర్ ఉపయోగపడుతుందని వైద్యం కోసం దూరప్రాంతాలకు వెళ్ళకుండా ఇక్కడ అన్ని రకాల వైద్య సేవలు అందిస్తారని తెలిపారు.

# 22ఏ భూముల సమస్యలపై వేగంగా చర్యలు

**పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి..**
**అధికారులకు మంత్రి పొంగులేటి ఆదేశం**




ముద్ర, హైదరాబాద్, : 22ఏ నిషేధిత భూములకు సంబంధించిన సమస్యల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. నిజమైన భూ యజమానులకు ఎలాంటి అనవసర ఇబ్బందులు ఎదురుకాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. గురువారం అధికారులతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో 22ఏ కాల్ సెంటర్ పనితీరు, అందుతున్న ఫిర్యాదులు, దరఖాస్తుల పరిష్కార పురోగతిపై మంత్రి సమీక్షించారు.

ఇప్పటివరకు 22ఏ కాల్ సెంటర్‌కు సుమారు 400 కాల్స్ వచ్చినట్లు అధికారులు మంత్రికి వివరించారు. ప్రతి కాల్‌ను, ప్రతి దరఖాస్తును కేవలం ఫిర్యాదుగా కాకుండా ఒక బాధ్యతగా పరిగణించాలని పొంగులేటి సూచించారు. దరఖాస్తుదారుల వివరాలను సంబంధిత తహసీల్దార్, ఆర్డీవో, సబ్ రిజిస్ట్రార్‌లకు వెంటనే పంపించి, సమస్య పరిష్కారమయ్యే వరకు ప్రతి కేసును నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.

## బైక్‌పై సీపీ సజ్జనార్..

**- కేబీఆర్ వన్‌వేపై సడన్ చెక్.! - సివిల్ డ్రెస్‌లో క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ**
**- రెండు సార్లు బైక్‌పై తిరిగిన సీపీ - వన్‌వే ట్రాఫిక్‌పై సంతృప్తి**
**- నగరవాసులు సహకరించాలని విజ్ఞప్తి**



**ముద్ర, హైదరాబాద్ :** కేబీఆర్ పార్కు పరిసరాల్లో నూతనంగా అమలులోకి తెచ్చి న వన్ వే ట్రాఫిక్ విధానాన్ని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ శ్రీ వీసీ సజ్జనర్ స్వయం గా పరిశీలించారు. గురువారం ఉదయం 10 గంటల సమయంలో ఎలాంటి ఆర్భాటా లు లేకుండా, ఒక సాధారణ పౌరుడిలా సివిల్ దుస్తుల్లో బైక్ పై ప్రయాణిస్తూ ఆయన క్షేత్రస్థాయి ట్రాఫిక్ పరిస్థితిని ప్రత్యక్షంగా పర్యవేక్షించారు.

**రెండు సార్లు బైక్‌పై తిరిగి క్షేత్రస్థాయి పర్యవేక్షణ**

రోడ్ నంబర్ 45 నుంచి జూబ్లీ చెక్ పోస్ట్ , వెంకటగిరి, కేబీఆర్ పార్క్ ప్రధాన గేటు, ముగ్ధ జంక్షన్, బసవతారకం, అగ్రసేన్ చౌరస్తా, ఫిల్మ్ నగర్ జంక్షన్ మీదుగా తిరిగి రోడ్డు నంబర్ 45 వరకు సీపీ సజ్జనర్ రెండు సార్లు బైక్ పై తిరుగుతూ మార్గంలో ట్రాఫిక్ ప్రవాహాన్ని పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న సమయంలో కూడా మరోసారి వెళ్లి ట్రాఫిక్ సరళిని పర్యవేక్షించారు. ఈ క్రమంలో అగ్రసేన్ చౌరస్తా, ఫిల్మ్ నగర్ , జర్నలిస్ట్ కాలనీ, జూబ్లీ చెక్ పోస్ట్ , కేబీఆర్ పార్కు ప్రధాన గేటు తదితర కూడళ్ల వద్ద విధుల్లో ఉన్న పోలీస్ సిబ్బందితో మాట్లాడి అక్కడ నెలకొన్న పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.

**సాఫీగా సాగుతున్న వన్‌వే.. నగరవాసులు సహకరించాలి**

ఈ సందర్భంగా సీపీ వీసీ సజ్జనర్ మాట్లాడుతూ, కేబీఆర్ పార్క్ చుట్టూ వన్ వే ట్రాఫిక్ రాకపోకలు సాఫీగా సాగుతున్నాయని తెలిపారు. బుధవారం ఈ విధానాన్ని ప్రారంభించిన తొలిరోజు లేన్ల మార్పిడి విషయంలో వాహనదారులు కాస్త అయోమయానికి గురైనప్పటికీ, గురువారం నాటికి పరిస్థితులు పూర్తిగా చక్కబడ్డాయని చెప్పారు. వాహనదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని జంక్షన్లలో స్పష్టమైన సైన్ బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు తగినంత మంది సిబ్బందిని విధుల్లో ఉంచినట్లు ఆయన వివరించారు.

అలాగే జీహెచ్ ఎంసీ , నిర్మాణ ఏజెన్సీలతో సమన్వయం చేసుకుంటూ హెచ్–సిటీ ప్రాజెక్టు పనులను వీలైనంత త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. పనులు పూర్తయ్యేంత వరకు నగరవాసులు సహకరించి, హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు జారీ చేసే సూచనలను పాటించాలని ఈ సందర్భంగా ఆయన విజ్ఞప్తి చేశారు.

## నా కూతురు మాటలతో నాకేం సంబంధం?

**- పీసీసీ నోటీసులపై కొండా సురేఖ ఘాటు వివరణ**
**- కుమార్తె వ్యాఖ్యలతో నాకు సంబంధం లేదు**
**- పార్టీ అధిష్ఠానంపై పూర్తి గౌరవం**
**- నోటీసు ఉపసంహరించుకోవాలని విజ్ఞప్తి**



**ముద్ర, హైదరాబాద్:** టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ జారీ చేసిన నోటీసుపై రాష్ట్ర మంత్రి కొండా సురేఖ స్పందించారు. ఈ మేరకు క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ మల్లు రవికి రాసిన లేఖలో తన వివరణ ఇచ్చారు. ఇటీవల తన కుమార్తె కొండా సుష్మిత పటేల్ చేసిన వ్యాఖ్యలు పూర్తిగా ఆమె వ్యక్తిగత అభిప్రాయాలని సురేఖ స్పష్టం చేశారు. కుటుంబ బంధాల కారణంగా ఒకరు చేసిన వ్యాఖ్యలకు మరొకరిని రాజకీయంగా బాధ్యులను చేయడం సరికాదని, కుమార్తె అభిప్రాయాలకు తనను బాధ్యురాలిని చేయడం న్యాయసూత్రాలకు విరుద్ధమని లేఖలో పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకత్వం, అధిష్ఠానం నిర్ణయాలు , పార్టీ క్రమశిక్షణా నియమావళిపై తనకు సంపూర్ణ గౌరవం ఉందని మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. ఈ వివాదాస్పద వ్యాఖ్యల వ్యవహారంలో తనకు ఎలాంటి ప్రమేయం లేదనే విషయాన్ని క్రమశిక్షణ కమిటీ గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. తన ప్రమేయం లేని అంశంలో జారీ చేసిన ఈ నోటీసును వెంటనే ఉపసంహరించుకోవాలని కమిటీని కోరారు.

## ఆర్డీవో కార్యాలయంలో ఏవో.. ఆస్తులు రూ.100కోట్ల పైమాటే!



**ముద్ర, హైదరాబాద్**: ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం ఆర్డీవో కార్యాలయంలో అడ్మిన్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి ఇంట్లో భారీగా ఆస్తులు గుర్తించారు. ఈ మేరకు ఏసీబీ డీఎస్పీ ఆనంద్ వివరాలు వెల్లడించారు. శ్రీనివాస్‌రెడ్డి ఇంట్లో కిలోకు పైగా బంగారం, 8 ఖాళీ స్థలాలు, యాచారంలో 10 ఎకరాల భూమి, హస్తినాపురంలో మూడంతస్తుల భవనం, ఓ బార్‌లో కుమారుడి పేరిట రూ.86 లక్షల పెట్టుబడి, 7 బ్యాంకు ఖాతాల్లో రూ.8 లక్షలు, ఇంట్లో రూ.4 లక్షలు, 3 కార్లు, 3 ద్విచక్ర వాహనాలు గుర్తించారు. బహిరంగ మార్కెట్‌లో వీటి విలువ రూ.100 కోట్లపైగానే ఉంటుందని ఏసీబీ అధికారుల అంచనా వేస్తున్నారు. గతంలో శ్రీనివాస్‌రెడ్డి మహేశ్వరం తహసీల్దార్‌గా విధులు నిర్వర్తించారు.

## కారంలో 30 శాతం చెక్కపొడి..

**కల్తీ మసాలా తయారీ కేంద్రంపై పోలీసుల దాడులు**



**ముద్ర, మల్కాజిగిరి :** మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలో కల్తీ మసాలా తయారీ కేంద్రంపై ఎస్‌వోటీ పోలీసులు, ఆహార కల్తీ పర్యవేక్షణ బృందాలు సంయుక్తంగా దాడులు చేశాయి. మేడిపల్లి శ్రీనివాస్‌నగర్ కాలనీలోని సాయి తిరుమల ఎంటర్‌ప్రైజెస్‌పై పోలీసులు దాడి చేసి తనిఖీలు చేపట్టారు. అపరిశుభ్ర వాతావరణంలో పసుపు, కారం, ధనియాల పొడి, గరం మసాలా తయారీ చేస్తున్నట్లు గుర్తించారు.కారం పొడిలో ఏకంగా 30 శాతం చెక్క పొడి కలిపినట్లు.. స్వదేశీ స్వస్తిక్ బ్రాండ్ పేరుతో డూప్లికేట్ ప్యాకింగ్, లేబులింగ్ చేసినట్లు నిర్ధరించారు. ఒరిజినల్ బ్రాండ్‌ను పోలిన ప్యాకెట్లలో కల్తీ కారం పొడి విక్రయానికి సిద్ధం చేసినట్లు గుర్తించారు. వీటిని వివిధ వాణిజ్య సంస్థలు, వినియోగదారులకు సరఫరా చేస్తున్నట్లు తేల్చారు. మొత్తం 10,890 కిలోల కల్తీ ఆహార పదార్థాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ సుమారు రూ.25లక్షలు ఉంటుందని అంచనా. ఈ ఘటనలో నిర్వాహకులు సత్యనారాయణ, రుద్రశేఖర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com

## శ్రావణ మాసంలో
# గోపూజ?

శ్రావణమాసం అనగానే ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంటుంది. ఈ నెల మొత్తంలో పూజలు, వ్రతాలు కనిపిస్తాయి. ఆలయాలతో పాటు ఇళ్లల్లో కూడా ప్రత్యేక శోభ సంతరించుకుంటుంది. శ్రావణమాసం అనగానే మహిళలు కొన్ని ప్రత్యేక వ్రతాలు చేస్తారు. వీటిలో వరలక్ష్మి వ్రతం గురించి చెప్పుకోవచ్చు. అయితే వరలక్ష్మి వ్రతం తో పాటు గోపూజ కూడా ప్రాధాన్యతను సంతరించుకుంది. గోపూజ చేయడం వల్ల ఐశ్వర్యంతో పాటు అన్ని రకాల శుభాలు కలుగుతాయని కొందరు పండితులు చెబుతున్నారు. మరి ఈ గోపూజ ఎలా చేయాలి? సమీపంలో గోవులు లేకపోతే ఏం చేయాలి? పూర్తి వివరాలతో ఆసక్తికరమైన కథనం..

కుంటారు. ఈ శ్రావణమాసం మొత్తంలో ఇలా ఇంటికి వచ్చిన గోవును సాదరంగా ఆహ్వానించి.. గోవు నెత్తిపై పసుపు రాసి కుంకుమ బొట్లు పెట్టాలి. పాదాలకు తెల్ల పూలు, జిల్లేడు పుష్పాలతో పూజ చేయాలి. ఈ సమయంలో ఓం సురభ్యే నమః అనే మంత్రాన్ని 21సార్లు జపించాలి. ఆ తర్వాత ఒక పాత్రలో నీరు తీసుకొని అందులో అక్షింతలు, పూలు వేసి గోవు పాదాల వద్ద అర్ఘ్యం ఇవ్వాలి.

అయితే సమీపంలో గోవులు లేకున్నా కూడా గోవు పూజ చేయవచ్చు. గోవు చిత్రపటాన్ని ఇంటిలోకి తీసుకువచ్చి.. దానిని అలంకరించాలి. ఇక్కడ కూడా తెల్ల పూలు, జిల్లేడు పూలను సమర్పించాలి. ఆవు నెయ్యితో దీపం వెలిగించి తీపి కలిగిన పదార్థాలతో నైవేద్యం పెట్టవచ్చు. ఆ తర్వాత అదే మంత్రాన్ని జపించాలి.



హిందూ పురాణం ప్రకారం.. పాలసముద్రం చిలికినప్పుడు అందులో నుంచి లక్ష్మీదేవి ఉద్భవించిన విషయం అందరికీ తెలిసిన విషయమే. అయితే ఇదే సమయంలో ఐదు గోవులు కూడా వచ్చినట్లు పురాణాలు పేర్కొంటున్నాయి. ఈ ఐదింటిని సుభద్ర, నంద, సుశీల, సురభి, బహుళ అనే పేర్లతో పిలుస్తారు. లక్ష్మి తో పాటు ఈ గోవులను పూజించడం వల్ల అనుకున్న ఫలితాలు ఉంటాయని పురాణం తెలుపుతుంది. అయితే గోపూజను ఎలా చేయాలి?

సాధారణంగా కొన్ని ప్రాంతాల్లో ఇంటి ముందర గోవు వచ్చి నిలబడుతుంది. అయితే కొందరు ఈ గోవును దూరం చేసు

శ్రావణమాసంలో ఏ రోజు అయినా ఈ పూజ చేయవచ్చు. గోవు పూజ చేయడం వల్ల సకల దేవతల అనుగ్రహం ఉంటుందని భావిస్తారు. ఈ పూజ చేస్తే కుటుంబం సంతోషంగా ఉంటుందని.. ఆయురారోగ్యాలతో కొనసాగుతారని చెబుతారు. అంతేకాకుండా కోరికలు తీరని వారు ఈ పూజ చేసినా కూడా అనుకున్నది సాధిస్తారని పండితులు చెబుతున్నారు. అందువల్ల శ్రావణంలో ఏ ఒక్కరోజు అయినా గోపూజ చేసిన ప్రయత్నం చేయాలి.

## ఆస్తులు కాదు.. ఆప్యాయతలే
# అసలైన సంపద

### స్టేటస్‌లు పెరుగుతున్నాయి... సంబంధాలు తగ్గుతున్నాయి

ఈరోజు మనిషి సంపాదన పెరుగుతోంది. సౌకర్యాలు పెరుగుతున్నాయి. సాంకేతికత అందుబాటులోకి వచ్చింది. సోషల్ మీడియాలో పరిచయాలు వేల సంఖ్యలో పెరుగుతున్నాయి. కానీ అదే సమయంలో మనసుకు దగ్గరైన మనుషుల సంఖ్య మాత్రం తగ్గిపోతోంది. అందుకే ఒక్కసారి మనల్ని మనం ప్రశ్నించుకోవాల్సిన సమయం వచ్చింది—మన జీవితంలో నిజంగా మనతో నిలిచే మనుషులు ఎంతమంది?



మీ ఫోన్‌లో వెయ్యి కాంటాక్ట్స్ ఉండవచ్చు. వందల మంది స్నేహితులు ఉండవచ్చు. వేల మంది ఫాలోవర్లు ఉండవచ్చు. కానీ అర్ధరాత్రి ఆపద వచ్చినప్పుడు "నేనున్నాను... భయపడకు" అని భరోసా ఇచ్చే మనిషి ఎంతమంది ఉన్నారు? అదే మన జీవితానికి అసలైన కొలమానం.

ఈరోజు మనం మంచి ఉద్యోగాలు, మంచి జీతాలు, మంచి ఇళ్లు, మంచి కార్లు సంపాదించడానికి పరుగులు తీస్తున్నాం. కానీ మనల్ని నిజంగా ప్రేమించే మనుషులను మాత్రం నెమ్మదిగా కోల్పోతున్నాం. ప్రతి ఇంట్లో ఒక విచిత్రమైన నిశ్శబ్దం కనిపిస్తోంది. అందరి చేతిలో ఫోన్ ఉంది.. కానీ ఒకరితో ఒకరు మాట్లాడేందుకు సమయం లేదు. అందరూ ఆన్‌లైన్‌లో ఉన్నారు... కానీ మనసులు మాత్రం ఆఫ్‌లైన్‌లో ఉన్నాయి.

ప్రతిరోజూ వందలాది 'Good Morning' సందేశాలు వస్తుంటాయి. కానీ "నువ్వు నిజంగా ఎలా ఉన్నావు?" అని మనస్ఫూర్తిగా అడిగే మనిషి మాత్రం అరుదైపోతున్నాడు.

ఇంతకుముందు బంధాలు ప్రేమతో, ఆప్యాయతతో కొనసాగేవి. ఇప్పుడు వాటిని కూడా లాభనష్టాల కోణంలో కొలుస్తున్నాం.

'వాళ్లు మన ఇంటికి రాలేదు... మనం ఎందుకు వెళ్లాలి?'

'వాళ్లు ఫోన్ చేయలేదు... మనం ఎందుకు చేయాలి?'

ఇలాంటి లెక్కలు వేసుకుంటూ మన జీవితంలో ఎంతో విలువైన మనుషులనే ఒక్కొక్కరుగా దూరం చేసుకుంటున్నాం.

మన తాతలు, అమ్మమ్మలు మనకు కోట్ల ఆస్తులు వదిలి వెళ్లకపోయినా, కలిసిమెలిసి జీవించే సంస్కృతిని అందించారు. మన తల్లిదండ్రులు పెద్ద ఇళ్లు ఎలా కట్టుకోవాలో మాత్రమే నేర్పలేదు; మనుషులను ఎలా కలుపుకొని వెళ్లాలో కూడా నేర్పారు.

మరి మనం మన పిల్లలకు ఏమి నేర్పిస్తున్నాం?




'ఫస్ట్ రావాలి... ఎక్కువ సంపాదించాలి... అందరికంటే పైకి వెళ్లాలి..' అని చెబుతున్నాం.

కానీ..

'ఎవరినీ చిన్నచూపు చూడొద్దు..'

'బంధాలను వదులుకోవద్దు..'

'కష్టాల్లో ఉన్నవారికి తోడుగా నిలబడాలి..'

అని ఎంతమంది చెబుతున్నాం?

జీవితంలో ఒక గొప్ప నిజం ఉంది. బ్యాంక్ బ్యాలెన్స్ మన కోసం కన్నీరు పెట్టదు. హోదా మనకు ఓదార్పు ఇవ్వదు. కారు మన పక్కన కూర్చుని మన బాధను వినదు. మనుషులే వస్తారు. బంధాలే నిలుస్తాయి. ప్రేమే చిరస్థాయిగా మిగులుతుంది.

ఈరోజు అహం కోసం మాట్లాడకపోతే... రేపు మాట్లాడాలనుకున్నా వినే మనిషే లేకపోవచ్చు. ఈరోజు "బిజీ" అంటూ దూరం పెడితే... రేపు మన ఒంటరితనాన్ని పంచుకునే భుజం దొరకకపోవచ్చు.

మనం సోషల్ మీడియాలో ఎన్నో పోస్టులు పెడుతున్నాం. కానీ మన అమ్మానాన్నలతో గంటసేపు మనస్ఫూర్తిగా మాట్లాడుతున్నామా? మన అన్నాచెల్లెళ్లతో కలిసి నవ్వుతున్నామా? ఏ పని లేకపోయినా బంధువుల ఇంటికి వెళ్లి పలకరిస్తున్నామా?

జీవితం చాలా చిన్నది. అహంకారం కోసం కాదు.. ఆప్యాయత కోసం.




డా. ఎస్. రాజారామ్
7799910222


డబ్బు సంపాదించండి. కానీ మనుషులను కోల్పోయి కాదు. విజయం సాధించండి. కానీ బంధాలను త్యాగం చేసి కాదు. పిల్లలకు ఆస్తులు ఇవ్వండి. కానీ వాటికంటే విలువైన సంబంధాల సంపదను కూడా వారసత్వంగా ఇవ్వండి.

మన పిల్లలు మనం సంపాదించిన డబ్బును కొంత కాలం మాత్రమే గుర్తుంచుకోవచ్చు. కానీ మనం వారిని ఎలా ప్రేమించామో, మనుషులతో ఎలా మెలిగామో, బంధాలను ఎలా కాపాడామో మాత్రం తరతరాలకు గుర్తుండిపోతుంది.

అందుకే ఈరోజు నుంచే ఒక చిన్న నిర్ణయం తీసుకుందాం.

అహాన్ని తగ్గిద్దాం.

క్షమించడం నేర్చుకుందాం.

ముందుగా మనమే పలకరిద్దాం.

దూరమైన బంధాలను దగ్గర చేసుకుందాం.

కుటుంబాన్ని మళ్లీ కుటుంబంగా మార్చుకుందాం.

మనిషి చనిపోయిన తర్వాత అతని బ్యాంక్ బ్యాలెన్స్ గురించి ఎవరూ మాట్లాడరు. అతను ఎంత సంపాదించాడన్నది కంటే, అతను ఎంత మంచి మనిషిగా జీవించాడు? ఎంతమందిని కలుపుకొని వెళ్లాడు? ఎంతమంది జీవితాల్లో ప్రేమను నింపాడు? అన్నదే గుర్తుండిపోతుంది.

కాబట్టి మనం మన పిల్లలకు వదిలి వెళ్లాల్సింది ఆస్తులు మాత్రమే కాదు... వారు గర్వంగా చెప్పుకునే బంధాల ప్రపంచం కూడా.

ప్రపంచం మారాలని ఎదురుచూడకండి. మార్పు మీ ఇంటి నుంచే ప్రారంభించండి. ఒక పలకరింపుతో ప్రారంభించండి. ఒక ఫోన్ కాల్ చేయండి. ఒక అపార్థాన్ని తొలగించండి. ఒక బంధాన్ని మళ్లీ కలుపుకోండి.

ఎందుకంటే..

సంపద మనిషిని గొప్పవాడిని చేయదు... సంబంధాలను కాపాడిన మనసే మనిషిని చిరస్మరణీయుడిని చేస్తుంది.

మన దేశంలో రైల్ జర్నీ చేసేవారి సంఖ్య చాలా ఎక్కువగానే ఉంటుంది. తక్కువ ధరతో ఎక్కువ దూరం ప్రయాణం చేయడానికి ఈ మార్గమే అనుగుణంగా ఉంటుంది. అయితే ఎక్కువ దూరం రైల్ ప్రయాణం చేసేవారు కొన్ని స్టేషన్లలో తినుబండారాలు కొనుగోలు చేస్తుంటారు.

ముఖ్యంగా వాటర్ బాటిల్స్ ను కొనుగోలు చేసేవారు ఎక్కువే. అయితే రైల్వే స్టేషన్లలో ఉన్న స్టోర్స్‌లో కొందరు వాటర్ బాటిల్ పై ఉన్న ఎంఆర్పి ధర కంటే అదనంగా డబ్బులు వసూ

విధిస్తున్నారు. అంతేకాకుండా కొన్ని స్టేషన్లలోని విక్రయ దారులు నాణ్యతలేని వస్తువులను కూడా అధిక ధరలతో అమ్ముతున్నారు. అయితే ఇలాంటి వారి గురించి ఫిర్యాదు చేయడానికి రైల్వే స్టేషన్ ప్రత్యేకంగా ఒక నంబర్ ను కేటాయించింది. నీ నెంబర్ ద్వారా సమస్యను చెప్పుకునే అవకాశం ఉంటుంది.

రైల్వే స్టేషన్ లో ఈ సమస్య ఎదుర్కొన్నవారు 139 కు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చు. ఇండియన్ రైల్వేతో పాటు ఐఆర్సిటిసి ప్రత్యేకంగా దీనిని కేటాయించారు. ఈ నెంబర్కు కాల్ చేసి రైల్వే స్టేషన్లలో ఉండే

## MRP కంటే ఎక్కువ ధరకు విక్రయిస్తే..
# కాల్ చేయండి

లు చేస్తుంటారు. దీనిపై అడిగితే స్టేషన్లలో అదనంగా ధర ఉంటుందని చెబుతుంటారు. కానీ ఇలా చేసే వారిపై ఫిర్యాదు చేయవచ్చు. అది ఎలాగో ఇప్పుడు చూద్దాం..

సాధారణ ప్రదేశాల్లోనైనా.. బస్ స్టేషన్, రైల్వే స్టేషన్లలో నైనా ప్రతి వస్తువును ఎమ్మార్పీ ధరకు మాత్రమే విక్రయించాలన్న రూల్ ఉంది. అయితే కొందరు అదనంగా డబ్బులు వసూలు చేయడానికి ప్రత్యేక చార్జీలు

స్టోర్స్ ద్వారా ఏమైనా ఇబ్బందులు ఉన్నా ఫిర్యాదు చేయవచ్చు. అంతేకాకుండా అధిక ధరతో వస్తువులను విక్రయిస్తే కూడా చెప్పవచ్చు. ఇలా ఫిర్యాదు చేసిన తర్వాత రైల్వే అధికారులు సంబంధిత విక్రయ షాపునకు వచ్చి తనిఖీలు చేస్తారు. ఫిర్యాదు నిజమే అయితే ఆ షాప్ పై చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. అవసరం అనుకుంటే ఆ స్టోర్ ను మూసివేయచ్చు కూడా.




అయితే ప్రయాణికులు ఈ ఫిర్యాదు చేసేముందు సరైన ఆధారాలను ఉంచుకోవాలి. విక్రయ దారులు ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు విక్రయిస్తున్నాడా? లేదా? తెలుసుకోవడానికి సంబంధిత బిల్లును ఇవ్వమని అడగాలి. అంతేకాకుండా ప్రయాణికులు తమ టికెట్ నెంబర్‌ను అందుబాటులో ఉంచుకోవాలి. అప్పుడే ఫిర్యాదు చేయడానికి ఆస్కారం ఉంటుంది. అయితే ఈ కాల్ ద్వారా మాత్రమే కాకుండా Railmadad అనే వెబ్ సైట్ లో కూడా ఫిర్యాదు చేయవచ్చు.

## తరం ఒకటే..
# ఉద్యమాలే వేరు!

జెన్‌జీ.. ఇటీవల కాలంలో ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. కొందరు దాన్ని తిరుగుబాటు ధోరణి, అమర్యాద, హింసతో ముడిపెడుతున్నారు. మరికొందరు దానిని న్యాయం కోసం పోరాడే శక్తిగా చూస్తున్నారు. భారతదేశంలోనే ఇటీవల రెండు ప్రముఖ జెన్‌జీ ఉద్యమాలు జరిగాయి. ఒకటి సీజేపీ(కాక్రోచ్ జనతా పార్టీ) పేరుతో, మరొకటి జార్ఖండ్‌లో విద్యార్థులు, యువకులు నడిపిన పరీక్షల సంస్కరణ ఉద్యమం. ఈ రెండింటి మధ్య వ్యవహార శైలి, లక్ష్యం, భాష, పద్ధతుల్లో స్పష్టమైన తేడా కనిపిస్తుంది.

### జెన్‌జీ అంటే..

జెన్‌జీ అంటే 30 ఏళ్లలోపు యువత. సాధారణంగా అందరూ జెన్‌జీ అంటే ఎవరి మాట వినని, గౌరవం లేని, బూతులు తిట్టే, హింస



కు పాల్పడే తరంగా చిత్రీకరిస్తున్నారు. శ్రీలంక, నేపాల్, బంగ్లాదేశ్‌లలో జరిగిన ఉద్యమాల్లో కూడా ఇలాంటి లక్షణాలు కనిపించాయి. అయితే అన్ని జెన్‌జీ ఉద్యమాలూ ఒకేలా ఉండవు. లక్ష్యం, నాయకత్వం, పద్ధతులు మారితే ఫలితాలు కూడా మారతాయి. భారత్‌లోని రెండు ఉద్యమాలు దీనికి ఉదాహరణ.

### సీజేపీ ఉద్యమం వెనుక రెజీమ్ చేంజ్

ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద సీజేపీ నిర్వహించిన ఉద్యమంలో పాశ్చాత్య శైలి టాక్టిక్స్ స్పష్టంగా కనిపించాయి. ఇది కేవలం ఒక సమస్యపై దృష్టి పెట్టకుండా, ప్రభుత్వ మార్పు దిశగా కదిలింది. జంతర్‌మంతర్ వద్ద హిందూ వ్యతిరేక, దేశ వ్యతిరేక అంశాలు చర్చకు వచ్చాయి. నీట్ లీకేజీని అడ్డం పెట్టుకుని అనేక ఇతర విషయాలు, శక్తులు తెరపైకి వచ్చాయి. మోదీ, ఆయన కుటుంబం మీద తీవ్రమైన భాష, రీల్స్, టార్గెట్ చేసే విధానం కనిపించింది. పోలీసులపై దాడులు, మీడియాపై దాడులు, పార్లమెంట్‌పై యత్నం వంటి సంఘటనలు జరిగాయి. యాంటీ–హిందూ, యాంటీ–నేషన్ స్లోగన్లు కూడా వినిపించాయి. ఇది ఒక సమస్య పరిష్కారం కంటే విస్తృత రాజకీయ లక్ష్యంతో జరిగింది.

### జార్ఖండ్ ఉద్యమం వెనుక

జార్ఖండ్‌లో జరిగిన ఉద్యమం పూర్తిగా భిన్నంగా ఉంది. విద్యావ్యవస్థ, పరీక్షల నిర్వహణలో లోపాలు, రిక్రూట్‌మెంట్‌లో అవినీతి




మీదే దృష్టి ఈ ఉద్యమంలో పాల్గొన్న, నడిపిన జెన్‌జీ దృష్టి పెట్టింది. జేపీఎస్‌సీ, సీఎస్ఈ, జేఎస్ఎస్‌సీ, సీజీఎల్ వంటి ఉద్యోగ పరీక్షలు సమస్యగా మారాయి. టీఎస్ఆర్ డేటా ప్రాసెసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ నిర్వహించిన పరీక్షలను ప్రభుత్వం రద్దు చేసింది. 2014 నుంచి జరిగిన పరీక్షలపై దర్యాప్తు చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. విద్యార్థులు సమ్మె విరమించకుండా సీబీఐ విచారణ కోరుతున్నారు. కానీ ఈ ఉద్యమంలో హింసకు తావు లేదు. పోలీసులపై దాడి జరగలేదు. ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌ను బూతులు తిట్టలేదు. ఆయన తండ్రి శిబు సోరెన్ పుట్టినరోజును ఆందోళనకారులే ఘనంగా జరుపుకున్నారు. రాజకీయ వ్యక్తులు వచ్చి మద్దతు తెలపాలనుకున్నా, వేదిక పైకి రానివ్వలేదు. 'మా ఉద్యమం రాజకీయం కాదు. పరీక్షల్లో అవినీతి తొలగించాలి, పారదర్శకత రావాలి, దోషులను శిక్షించాలి' అని స్పష్టం చేశారు. చివరకు పరీక్షల్లో మార్పులు వచ్చాయి. ఉద్యమం సఫలమైంది.

### రెండు ఉద్యమాల మధ్య తేడాలు

జార్ఖండ్‌లో జెన్‌జీ ఉద్యమం ఒక సమస్యపైనే ఫోకస్ పెట్టింది. సీజేపీలో సమస్యను దాటి రెజీమ్ చేంజ్, విస్తృత రాజకీయ లక్ష్యాలను దృష్టిలో పెట్టుకుని నడిపింది. జార్ఖండ్‌లో అమర్యాద, బూతులు, వ్యక్తిగత దాడులు లేవు. సీజేపీ ఉద్యమంలో తీవ్ర భాష, కుటుంబాల మీద దాడి జరిగాయి. జార్ఖండ్‌లో హింస లేదు. జంతర్‌మంతర ఉద్యమంలో పోలీసులు, మీడియా ప్రతినిధులపై దాడులు జరిగాయి. జార్ఖండ్‌లో జరిగిన ఉద్యమంతో కీలక మార్పులు వచ్చాయి. సీజేపీ ఉద్యమంతో సమస్య పరిష్కారం కన్నా రాజకీయ ఉద్రికత్తత పెరిగింది.

జెన్‌జీ తరం ఒకేలా ఉండదు. లక్ష్యం స్పష్టంగా ఉండి, నాగరికంగా, హింస రహితంగా ఉద్యమించినప్పుడు అది సానుకూల మార్పు తీసుకురాగలదు. జార్ఖండ్ ఉద్యమం దీనికి నిదర్శనం. అదే సమయంలో లక్ష్యం మసకబారి, హింస, అమర్యాద, రాజకీయ టార్గెటింగ్ ముందుకు వచ్చినప్పుడు ఉద్యమం విశ్వసనీయత కోల్పోతుంది. జెన్‌జీ శక్తిని సమస్య పరిష్కారం వైపు మళ్లించడమే సమాజం, ప్రభుత్వాలు, యువత ఇద్దరి బాధ్యత.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
శుక్రవారం 21.08.2026
www.mudranews.in | @mudranews



**వరలక్ష్మీ వ్రతం సందర్భంగా**

తోరం కట్టుకోవాలి. తొమ్మిది పోగులు, ముడులతో సిద్ధం చేసిన పసుపు దారాన్ని పూజించి, సంప్రదాయం ప్రకారం కుడి చేతికి కట్టుకోవాలి.



# కల్తీ మసాలాల తయారీ కేంద్రంపై పోలీసుల దాడి



**ముద్ర, హైదరాబాద్:** ప్రజారోగ్యంతో చెలగాటమాడితే కఠిన చర్యలు తప్పవని మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి హెచ్చరించారు. మెడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని శ్రీనివాస్‌నగర్‌లో సాయి తిరుమల ఎంటర్‌ప్రైజెస్ పేరుతో నిర్వహిస్తున్న కల్తీ మసాలాల తయారీ కేంద్రంపై పోలీసులు, ఎస్ఓటీ, ఫుడ్ అడల్టరేషన్ బృందాలు దాడులు నిర్వహించాయి.దాడుల్లో కారం పొడిలో సుమారు 30 శాతం రంపపు పొడి కలిపినట్లు అధికారులు గుర్తించారు. పసుపు, కారం, ధనియాల పొడి, గరం మసాలాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా, నకిలీ ప్యాకింగ్, లేబుళ్లతో బ్రాండెడ్ ఉత్పత్తులుగా విక్రయించేందుకు ప్రయత్నించినట్లు గుర్తించారు.మొత్తం 10.89 టన్నుల కల్తీ మసాలా పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.25 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. 2,300 కిలోల పసుపు పొడి, 3,350 కిలోల కారం పొడి, 5,140 కిలోల ధనియాల పొడి, 100 కిలోల గరం మసాలాను సీజ్ చేశారు. ఈ వ్యవహారంలో సత్యనారాయణ, రుద్రశేఖర్‌ను అదుపులోకి తీసుకున్నారు.కమిషనర్ సుమతి మాట్లాడుతూ కల్తీ ఆహార పదార్థాల తయారీ, నిల్వ, విక్రయాలపై నిరంతర నిఘా కొనసాగుతుందని తెలిపారు. ఆకర్షణీయమైన ప్యాకింగ్ చూసి మోసపోకుండా, ఆహార పదార్థాలు కొనుగోలు చేసేటప్పుడు తయారీ తేదీ, బ్యాచ్ నంబర్, ఎఫ్ఎస్ఎస్ఏఐ వివరాలు పరిశీలించాలని సూచించారు. కల్తీ ఆహారంపై సమాచారం ఉంటే 8712662111కు తెలియజేయాలని కోరారు.దాడుల్లో ఉప్పల్ జోన్ డీసీపీ కే. సురేష్‌కుమార్, ఎస్ఓటీ డీసీపీ మనోహర్, మెడిపల్లి ఏసీపీ మోహన్‌కుమార్, మల్కాజిగిరి, ఉప్పల్ జోన్ ఎస్ఓటీ సిబ్బంది పాల్గొన్నారు.

# జీవో 97ను రద్దు చేయాలి

**ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్**



**ముద్ర, హైదరాబాద్:** పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీసేలా ఉన్న జీవో నంబర్ 97ను వెంటనే రద్దు చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. స్కిల్ యూనివర్సిటీ పేరుతో పాలిటెక్నిక్ విద్యార్థులను నైపుణ్య కార్మికులుగా పరిమితం చేసే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు.తరగతి గదుల్లో ఉండాల్సిన పేద, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులు తమ భవిష్యత్తు కోసం రోడ్లపైకి రావాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. పాలిటెక్నిక్ తర్వాత ఇంజనీరింగ్ చదివే అవకాశాన్ని విద్యార్థులకు కొనసాగించాలని కోరారు. సింగపూర్, జర్మనీ వంటి దేశాల్లో డిప్లొమా తర్వాత ఇంజనీరింగ్ చదివే అవకాశం ఉన్నప్పుడు తెలంగాణలో ఎందుకు నిరాకరిస్తున్నారని ప్రశ్నించారు.పాలిటెక్నిక్ విద్య పేద, మధ్యతరగతి విద్యార్థులకు అందుబాటులో ఉన్న ముఖ్యమైన విద్యా మార్గమని అన్నారు. సుమారు 70 ఏళ్లుగా కొనసాగుతున్న సాంకేతిక విద్యా వ్యవస్థను బలోపేతం చేయాల్సింది పోయి నిర్వీర్యం చేసే ప్రయత్నాలు చేయడం సరికాదన్నారు. ఎస్‌బీటీఈటీ వంటి సాంకేతిక విద్యా వ్యవస్థ భవిష్యత్తుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలనీ డిమాండ్ చేశారు.విద్యార్థుల ఆందోళనలపై పోలీసులు వ్యవహరిస్తున్న తీరును ఆయన తప్పుబట్టారు. మహబూబాబాద్‌లో విద్యార్థి జాటోతు రాజేష్‌పై పోలీసులు దురుసుగా వ్యవహరించారని ఆరోపిస్తూ, సంబంధిత అధికారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు మద్దతుగా నిలిచిన బీఆర్ఎస్‌వీ నాయకులను అరెస్టు చేయడం దారుణమన్నారు.స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుకు ముందు విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రొఫెసర్లు, విద్యావేత్తలతో చర్చించాలని సూచించారు. గతంలో టాస్క్ ద్వారా లక్షలాది మందికి నైపుణ్య శిక్షణ అందించామని, అలాంటప్పుడు స్కిల్ యూనివర్సిటీ పేరుతో పాలిటెక్నిక్ వ్యవస్థను ఎందుకు మార్చాలని చూస్తున్నారని ప్రశ్నించారు.ఫ్యూచర్ సిటీ అభివృద్ధి, భూముల విలువ పెంచేందుకే స్కిల్ యూనివర్సిటీని ఉపయోగించుకుంటున్నారన్నది తమ ఆరోపణ అని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం జీవో 97ను ఉపసంహరించుకుని, పాలిటెక్నిక్ విద్యను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు.బీఆర్ఎస్ నాయకులు, విద్యార్థి నాయకులు మాట్లాడుతూ స్కిల్ యూనివర్సిటీ నిబంధనలు, వైస్‌చాన్సలర్ అర్హతలు, పాలిటెక్నిక్ కళాశాలల భవిష్యత్తుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు.

# సీఎం రేవంత్ భాష మార్చుకోవాలి



**మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్**

**ముద్ర, హైదరాబాద్:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన భాషను మార్చుకుని నోటిని అదుపులో పెట్టుకోవాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ హెచ్చరించారు. గురువారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి హోదాను మరిచి గౌరవం, సంస్కారం లేకుండా మాట్లాడటం సిగ్గుచేటని విమర్శించారు. కరోనా సమయంలో ఆక్సిజన్, బెడ్ల కొరతను దృష్టిలో పెట్టుకుని నాటి కేసీఆర్ ప్రభుత్వం సనత్‌నగర్, అల్వాల్, కొత్తపేటలో కార్పొరేట్ స్థాయి ఆసుపత్రుల నిర్మాణానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. తమ ప్రభుత్వ హయాంలోనే సుమారు 60 శాతం పనులు పూర్తయ్యాయని అన్నారు.సనత్‌నగర్ టిమ్స్‌ను తామే నిర్మించామని సీఎం చెప్పుకోవడం అవివేకమన్నారు. అవసరమైన వసతులు కల్పించకుండా ఆసుపత్రిని హడావుడిగా ప్రారంభించాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులకు రేవంత్‌రెడ్డి రిబ్బన్ కటింగ్‌లు చేస్తున్నారని విమర్శించారు. కమిషన్ల కోసమే 22ఏకమిషన్ల కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం 22ఏ నిబంధనను తీసుకొచ్చిందని తలసాని ఆరోపించారు. పేదల ఇళ్లు, ప్రైవేట్ భూములను 22ఏలో చేర్చే అధికారం ఎవరు ఇచ్చారని ప్రశ్నించారు. 22ఏ పేరుతో భూ యజమానులను భయపెట్టి భారీగా కమిషన్లు వసూలు చేస్తున్నారనే ఆరోపణలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.ఓట్లు పోకుండా చూడాలి. సనత్‌నగర్ నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు ఉండేలా పార్టీ శ్రేణులు పరిశీలించాలని తలసాని సూచించారు. ఎన్నికల సంఘం విడుదల చేసిన డ్రాఫ్ట్ ఓటరు జాబితాను పరిశీలించి పేర్లు లేనివారు సెప్టెంబర్ 16లోగా ఫారం-6 ద్వారా ఓటు నమోదు చేసుకునేలా చూడాలని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవసరమైన సిబ్బందిని పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచాలని కోరారు.

# ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు

**ముద్ర ప్రతినిధి, తాండూర్:** పెద్దేముల్ మండలం ఇందూరు గ్రామంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ 82వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. డీసీసీ అధ్యక్షులు జాదవ్ ధారాసింగ్ నాయక్ ముఖ్య అతిథిగా హాజరై రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు నర్సిరెడ్డి, కార్యవర్గ సభ్యులు గోపాల్, ఏ-బ్లాక్ అధ్యక్షులు లొంక నర్సింలు, సర్పంచుల సంఘం అధ్యక్షులు నారాయణగౌడ్, సర్పంచ్ వెంకట్, నాయకులు మల్లేశం, శ్రీనివాస్‌రెడ్డి, శంకర్, రియాజ్ పాల్గొన్నారు.

**ముద్ర, చేవెళ్ల :** భారత ప్రధాన మంత్రిగా దివంగత రాజీవ్ గాంధీ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. చేవెళ్ల లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం లో గురువారం రాజీవ్ గాంధీ 82 వ జయంతి సందర్బంగా ఆయన రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. మొయినాబాద్ లో ఆయన విగ్రహానికి, శంకర్ పల్లి ప్రధాన కూడలిలో మండల పార్టీ అధ్యక్షులు సత్యనారాయణ, వెంకట్ రెడ్డి ల ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూల దండాలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమం లో పీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్, చేవెళ్ల పురపాలిక చైర్ పర్సన్ సమత వెంకట్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రతాప్ రెడ్డి, ఆగిరెడ్డి, శ్రీనివాస్ గౌడ్, గోపాల్ రెడ్డి, చంద్రమౌళి, గోపాల్, ప్రభాకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



**ముద్ర ప్రతినిధి, తాండూర్:** వికారాబాద్ జిల్లా తాండూర్ మున్సిపల్ పరిధిలోని హైదరాబాద్ రోడ్డు మార్గంలో గల రాజీవ్ కాలనీలో తాండూర్ పట్టణ అధ్యక్షులు బాతుల నాగరాజ్ ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ 82వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చైర్ పర్సన్ పట్లోళ్ల నీరజ , మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ అబ్దుల్ రజాక్, పట్టణ అధ్యక్షులు బాతుల నాగరాజ్, 8 వార్డ్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ సాయప్ప, మాజీ కౌన్సిలర్ వేంకన్న గౌడ్, అడ్వకేట్ జిలాని, నా షేర్, బాతుల వెంకటయ్య, రాహుపూ, అప్పు బాయ్, రవికుమార్, పాల్గొన్నారు.

**ముద్ర, కూకట్‌పల్లి:** నియోజకవర్గ పరిధిలోని కె.పి.హెచ్.బి., మూసాపేట్, బాలానగర్, ప్రకాష్ నగర్ ప్రాంతాల్లో డివిజన్ అధ్యక్షుల ఆధ్వర్యంలో దివంగత ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ 82వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.స్థానిక ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ విగ్రహాల వద్ద ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షులు, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

## రాజీవ్ గాంధీకి నివాళి



**ముద్ర, న్యూఢిల్లీ:** స్వర్గీయ మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 82వ జయంతి సందర్భంగా పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో ఆయన చిత్రపటానికి కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, మల్లికార్జున ఖర్గేతో కలిసి కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు.

## R22 గ్రేస్ మార్కులపై హైకోర్టులో విచారణ

**ముద్ర, కూకట్‌పల్లి:** జేఎన్‌టీయూహెచ్ R22 రెగ్యులేషన్ విద్యార్థులకు గ్రేస్ మార్కులు మంజూరు చేయాలని కోరుతూ స్టూడెంట్స్ ప్రొటెక్షన్ ఫోరం దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టులో తొలి విచారణ జరిగింది. జస్టిస్ జువ్వాది శ్రీదేవి సమక్షంలో ఎస్‌పీఎఫ్ తరపు న్యాయవాది అనిల్‌రాజ్ విద్యార్థుల సమస్యలను కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. R22 నిబంధనల కారణంగా కొద్ది మార్కుల తేడాతో విద్యార్థులు పట్టాలు పొందలేక, ఉద్యోగ అవకాశాలు కోల్పోతున్నారని తెలి పారు. గ్రేస్ మార్కులను 0.15 శాతం నుంచి 0.50 శాతానికి పెంచాలని, ఒక సబ్జెక్టుకు మినహాయింపు ఇవ్వాలని కోరారు. వాదనలు విన్న హైకోర్టు R22 నిబంధనలు, గ్రేస్ మార్కు లపై తమ సూచనలు సమర్పించాలని ఆదేశించింది. తదుపరి విచారణను 25కు వాయిదా వేసింది. న్యాయపోరాటం కొనసాగిస్తామని ఎస్‌పీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రాహుల్ నాయక్ తెలిపారు.

## ట్రాన్స్‌జెండర్ల ఇంట ఆయుధాలతో దోపిడీ




**ముద్ర, కూకట్‌పల్లి:** కెపిహెచ్‌బి కాలనీ ట్రాన్స్‌జెండర్లను లక్ష్యంగా చేసుకుని ఆయుధాలతో బెదిరించి దోపిడీకి పాల్పడిన ముఠాలోని ఒక సభ్యుడిని కెపిహెచ్‌బి పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం ఈ నెల 15, 16 తేదీల మధ్య రాత్రి వేళ కారు, ఆటోలో వచ్చిన ఒక ముఠా రోడ్డుపై వెళ్తున్న ఒక ట్రాన్స్‌జెండర్‌ను కత్తితో బెదిరించి ఐఫోన్, బంగారు కమ్మలను దోచుకుంది. అనం తరం కెపిహెచ్‌బి 4వ ఫేజ్‌లోని ఒక ఇంట్లో కి దౌర్జన్యంగా చొరబడి, అక్కడి బాధితులపై దాడి చేసి మరికొన్ని మొబైల్ ఫోన్లు, బంగారు ఆభరణాలతో పరార య్యారు. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు, సిసిటివి దృశ్యాలు, సాంకేతిక ఆధారాల సహాయంతో జగద్గిరిగుట్టకు చెందిన ఆటో డ్రైవర్ షేక్ షరీఫ్ (18) అనే నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అతడి సమాచారం మేరకు నివాసంలో దాచిన ఒక ఐఫోన్, 5 గ్రాముల బంగారు కమ్మలను పంచుల సమక్షంలో స్వాధీనం చేసుకున్నారు. నిందితుడికి పాత నేరాల చరిత్ర ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. పరారీలో ఉన్న మిగిలిన నిందితుల కోసం, వాహనాలు మరియు ఆయుధాల రికవరీ కోసం ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు.

## మరో అవినీతి అధికారిపై ఏసీబీ సోదాలు



**ముద్ర, హైదరాబాద్:** ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారనే ఆరోపణలపై ఎమ్మార్వో శ్రీనివాస్‌రెడ్డికి చెందిన ఇళ్లు, కార్యాలయాల్లో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. గురువారం మొత్తం 15 ప్రాంతాల్లో ఏకకాలంలో తనిఖీలు చేపట్టినట్లు సమాచారం.ప్రస్తుతం ఇబ్రహీంపట్నం రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో పనిచేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి గతంలో మహేశ్వరం ఎమ్మార్వోగా విధులు నిర్వహించారు. ఆయనకు సంబంధించిన ఆస్తులు, బ్యాంకు ఖాతాలు, ఇతర ఆర్థిక లావాదేవీలపై ఏసీబీ అధికారులు వివరాలు సేకరిస్తున్నట్లు తెలుస్తోంది.సోదాలు పూర్తయిన అనంతరం స్వాధీనం చేసుకున్న ఆస్తులు, పత్రాలు, నగదు తదితర వివరాలను ఏసీబీ అధికారులు వెల్లడించే అవకాశం ఉంది.

## సమస్యలు పరిష్కరించడంలో కాంగ్రెస్ విఫలం

**బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రవికుమార్ యాదవ్**



**ముద్ర, శేరిలింగంపల్లి:** అనుమతులు లేకుండా బహుళ అంతస్తుల భవన నిర్మాణాలు, రోజు పొంగుతున్న డ్రైనేజీ, పాడైపోయిన రోడ్లు తదితక సమస్యల తో సావాసం చేస్తున్న అంజయ్య నగర్, బంజారా బస్తీ వాసులు అని బీజేపీ అధికార ప్రతినిధి గుర్తు చేశారు. మేము చేసే పోరాటానికి సిద్ధం అనే నినాదంతో బస్తీ బాట కార్యక్రమానికి పిలుపునిస్తూ ఈరోజు అంజయ్య నగర్ డివిజన్ లోని ప్రజల విజ్ఞప్తి మేరకు అంజయ్య నగర్, బంజారా బస్తీలలో సమస్యలపై పర్యటించిన బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంచార్జి రవికుమార్ యాదవ్, ముఖ్యఅతిథిగా పాల్గొన్న చేవెళ్ల మాజీ శాసన సభ్యులు రత్నం. కేంద్ర ప్రభుత్వ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం చేసిందని చెప్పుకుంటూ ప్రజలను మోసం చేస్తున్నారని రత్నం విమర్శించారు. ప్రజలను సమస్యల్లో ముంచెత్తుతున్న కాంగ్రెస్ పార్టీకి పాలించే అర్హత లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు రవి నాయక్, జిల్లా అధికార ప్రతినిధి ఆంజనేయులు సాగర్, సంతోష్ కుమార్, మన్యం కొండ సాగర్, సరోజ రెడ్డి, ఆమని, సాగర్, వెంకటేష్, కిషన్, క్రాంతి, ధనరాజ్, మోహిత్, శంకర్, సంజీవ్, చందు, మరియు ఇతర స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి

**ముద్ర, హైదరాబాద్:** ఆటో, క్యాబ్, స్కూల్ వ్యాన్, లారీ, డీసీఎం డ్రైవర్ల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. ఆగస్టు 24 నుంచి ట్రాన్స్‌పోర్ట్ జేఏసీ చేపట్టనున్న నిరవధిక సమ్మెకు సీపీఎం సంపూర్ణ మద్దతు ప్రకటించింది. సమ్మెకు ముందే ట్రాన్స్‌పోర్ట్ జేఏసీ నాయకులతో ప్రభుత్వం చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆగస్టు 24 నుంచి జరిగే నిరవధిక సమ్మెను విజయవంతం చేయాలని కార్మికులకు జాన్ వెస్లీ పిలుపునిచ్చారు.

## డీలిమిటేషన్‌పై రేవంత్‌ను కాంగ్రెస్ హైకమాండ్ లైట్ తీసుకుంది



**ముద్ర, హైదరాబాద్:** డీలిమిటేషన్ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపాదనలను కాంగ్రెస్ హైకమాండ్ పట్టించుకోవడం లేదని తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర నాయకులు సయ్యద్ ఇస్మాయిల్ విమర్శించారు. తెలంగాణ అసెంబ్లీ సీట్లు 50 శాతం పెరిగి 184కు చేరుతాయని, కాంగ్రెస్ 117 సీట్లు గెలుస్తుందని రేవంత్ పదేపదే చెబుతున్నారని గుర్తుచేశారు. గతంలో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలోనూ సీట్ల పెంపుపై ఆయన ప్రతిపాదనలు చేశారని తెలిపారు.

## టీపీసీసీ క్రమశిక్షణా కమిటీకి మంత్రి కొండా సురేఖ వివరణ

**ముద్ర, హైదరాబాద్:** టీపీసీసీ క్రమశిక్షణా కమిటీ జారీ చేసిన నోటీసుపై అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ గురువారం తన వివరణను లేఖ రూపంలో కమిటీ చైర్మన్ మల్లు రవికి పంపించారు. తన జన్మదినోత్సవం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా కొండా కుటుంబ అభిమానులు, కాంగ్రెస్ కార్యకర్తలు వేడుకలతో పాటు సేవా కార్యక్రమాలు నిర్వహించారని మంత్రి తెలిపారు. తన స్వస్థలమైన గీసుకొండతో తన కుమార్తె కొండా సుస్మితా పటేల్‌కు ఉన్న అనుబంధం కారణంగా అక్కడ నిర్వహించిన జన్మదిన వేడుకల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారని వివరించారు.ఆ కార్యక్రమంలో తన కుమార్తె చేసిన వ్యాఖ్యలు పూర్తిగా ఆమె వ్యక్తిగత అభిప్రాయాలని సురేఖ స్పష్టం చేశారు. కుటుంబ బంధం కారణంగా ఒకరి వ్యక్తిగత వ్యాఖ్యలకు మరొకరు రాజకీయంగా బాధ్యత వహించాల్సిన అవసరం లేదన్నారు. కుమార్తె వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిగా చేయడం సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకత్వం, క్రమశిక్షణా నియమావళిపై తనకు సంపూర్ణ గౌరవం ఉందని స్పష్టం చేసిన మంత్రి, వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని ఈ వ్యవహారంలో తన ప్రమేయం లేదని గుర్తించి, తనకు జారీ చేసిన నోటీసును ఉపసంహరించుకోవాలని క్రమశిక్షణా కమిటీని కోరారు.

## ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయం

**మాజీ మంత్రి సబితా రెడ్డి**



**ముద్ర, చేవెళ్ల:** ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, కొత్త భవనాల నిర్మాణం, విద్యార్థుల చదువులకు స్వచ్ఛంద సంస్థలు దా త లు చేయూత నందిచడం అభినందనీయమని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా రెడ్డి అన్నారు. మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు చొరవతో కార్పొరేట్ సామజిక బాధ్యత లో భాగంగా రూ. 5 కోట్ల తో శంకర్ పల్లి మండలం జన్వాడ లో నిర్మించిన ఉన్నత పాఠశాల నూతన భవనాన్ని గురువారం ఆమె స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్బంగా ఆమె మాట్లాడుతూ భారస ప్రభుత్వం లో విద్యకు ప్రాధాన్యత కల్పించమన్నారు. విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నంత శిఖరాలు అధిరోహించాలని అన్నారు.

**సలీం పాషా కుటుంబాన్ని పరామర్శించిన మాజీ మంత్రి**

వర్కింగ్ జెర్నలిస్ట్ యూనియన్ రంగా రెడ్డి జిల్లా అధ్యక్షులు సలీం పాషాను గురువారం మాజీ మంత్రి సబితా రెడ్డి పరామర్శించారు. ఇటీవల సలీం మాతృమూర్తి మృతి చెందడంతో గురువారం ఆమె శంకర్ పల్లి లోని ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. నాయకులు గోవర్ధన్ రెడ్డి మాణికరెడ్డి ఉపేందర్ ఉన్నారు.

## జోగిని అనురాధకు సన్మానం

**ముద్ర ప్రతినిధి, రాజేంద్రనగర్:** భవిష్యవాణిలో వినిపించినట్లుగా ప్రతి ఒక్క కార్యక్రమాన్ని అమ్మవార్ల దేవాలయాల వద్ద అమలు చేసి తీరుతామని బుజిలీ మహంకాళి ఆలయ చైర్మన్ భోగి బాల్ రాజ్ అన్నారు. లంగర్ హౌస్ బుజిలి మహంకాళి ఆలయంలో రంగం కార్యక్రమం తో పాటు జోగిని అనురాధ భవిష్యవాణి వినిపించారు. ఈ సందర్భంగా భోగి బాల్రాజ్ తో పాటు పలువురు ఆమె నివాసంలో అనురాధను కలిశారు. శాలువాతో ఆమెను సన్మానించి బోనాల మెమొంటోను అందించారు. అనంతరం బోనాల జాతర విజయవంతానికి కృషి చేసిన పలువురిని కలిసి సన్మానం చేశారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శుక్రవారం 21.08.2026
www.mudranews.in | @mudranews



## నైవేద్యం, వాయినం ఇవ్వాలి

పాయసం, పులిహోర, పండ్లు వంటి నైవేద్యాలను అమ్మవారికి సమర్పించి, పూజ అనంతరం ముత్తైదువులకు తాంబూలం, వాయినం ఇవ్వడం శుభప్రదంగా భావిస్తారు.



## కరీంనగర్ లో ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు

**యువతకు ఓటు హక్కు ఇచ్చిన మహనీయుడు రాజీవ్ గాంధీ - డా. మేడిపల్లి సత్యం**
**కార్పొరేషన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో యువత కొత్త ఓటర్ నమోదు కార్యక్రమం**
**రాజీవ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్తాం - కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్**
**కరీంనగర్ రాజీవ్ చౌక్ లో రాజీవ్ గాంధీకి ఘన నివాళులు**




**ముద్ర, కరీంనగర్ :** కార్పొరేషన్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని, ఆధునిక భారత నిర్మాత, భారతరత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా నేడు కరీంనగర్ లోని రాజీవ్ చౌక్ లో గల రాజీవ్ గాంధీ విగ్రహానికి చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ డిసిసి అధ్యక్షులు డా. మేడిపల్లి సత్యం హాజరై కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్, కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ వెలిచాల రాజేందర్ రావు, మాజీ సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, మాజీ శాసనసభ్యులు ఆరేపల్లి మోహన్, ఏఎంసీ చైర్మన్ ఆకుల నరసయ్యతో పాటు పలువురు నేతలతో కలిసి రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాల సమర్పించి ఘనంగా నివాళులు అర్పించి, రాజీవ్ గాంధీ సేవలను కొనియాడారు.

అనంతరం టిపిసిసి ఆదేశాల మేరకు కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్ రాజీవ్ గాంధీ గారి స్ఫూర్తితో S.I.R ప్రక్రియలో భాగంగా 18 ఏళ్లు నిండిన యువతకు కొత్త ఓటర్ నమోదు – ఫారం–6 నింపే కార్యక్రమాన్ని నిర్వహించగా డిసిసి మేడిపల్లి సత్యం 18 సంవత్సరాలు నిండిన యువతకు నూతన ఓటరు నమోదు ఫారం స్వయంగా పూరించి అందజేయడం జరిగింది

కార్యక్రమాన్ని ఉద్దేశించి డా. మేడిపల్లి సత్యం గారితో పాటు పలువురు నేతలు మాట్లాడుతూ మాజీ ప్రధాని శ్రీమతి ఇందిరా గాంధీ గారి హత్యానంతరం ఈ దేశం ఒక మంచి నాయకత్వం కోసం ఎదురుచూస్తున్న సమయంలో ఈ దేశాన్ని నడిపించగల సమర్థులైన నాయకులు రాహుల్ గాంధీ గారు అని ప్రతి పౌరుడు విశ్వసించారు.

రాజీవ్ గాంధీ గారు ప్రధానమంత్రి పదవి చేపట్టి దేశంలో అనేక సంస్కరణలు ప్రవేశపెట్టి ఐటీ రంగంతో పాటు టెలి కమ్యూనికేషన్ విభాగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చి నేడు ప్రతి పేదవాడు సెల్ ఫోన్, కంప్యూటర్ వినియోగించడానికి పునాదులు వేసిన గొప్ప నాయకులు, గ్రామాలు దేశానికి వెన్నెముక కావాలని స్థానిక సంస్థలను బలోపేతం చేసిన నాయకులు, నాడు దేశంలో బ్రిటిష్ విద్యా విధానం కొనసాగుతుంటే రాజీవ్ గాంధీ గారి సారథ్యంలో నూతన విద్యా విధానం పాలసీ తీసుకువచ్చి నేడు కార్పొరేట్ విద్యాలయాలను మించిన సకల సౌకర్యాలతో వేల మంది చదువుకుంటున్న జవహర్ నవోదయ విద్య అంకురార్పణ చేసినారు. ప్రధాని నరేంద్ర మోడీ విధానాలకు వ్యతిరేకంగా ప్రభుత్వ విధానాల్లో భాగస్వామ్యం కోరుకుంటూ జెన్ జీ ఉద్యమాలు చేస్తున్న ఈ రోజుల్లో, ఆనాడే రాజీవ్ గాంధీ గారు చట్ట సభలకు ఎన్నికయ్యే వ్యక్తులను ఎన్నిక చేసే బాధ్యతలో యువతను భాగస్వాములను చేయాలని 61 వ రాజ్యాంగ సవరణ చేసి 21 సంవత్సరాలకు ఉన్న యువతకు 18 సంవత్సరాలకే ఓటు హక్కు కల్పించిన గొప్ప మేధావి. రాజకీయరంగంలో తనదైన ముద్ర వేసుకున్న రాజీవ్ గాంధీ గారు చిన్న వయసులోనే తీవ్రవాదుల చేతుల్లో హత్యకు గురై దేశాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసినారు. వారి మరణానంతరం శ్రీమతి సోనియా గాంధీ గారు రాహుల్ గాంధీ గారు ఈ దేశ ప్రజలకు మేమున్నాం అంటూ ఈ దేశ ప్రజలను, కాంగ్రెస్ పార్టీని కాపాడే బాధ్యత వహిస్తూ యుపిఏ చైర్ పర్సన్ గా ఎన్నో సంస్కరణలు చేపట్టినారు.

ఈ కార్యక్రమంలో నాయకులు పురుమల్ల శ్రీనివాస్, రాచకొండ చక్రధర్ రావు, మడుపు మోహన్, వెన్న రాజ మల్లయ్య, పర్వత మల్లేశం, కాంతాల జగన్ రెడ్డి, మూల రవీందర్ రెడ్డి,ఇక్రమ్, ముస్తాక్ అహ్మద్, ముత్యం శంకర్ గౌడ్, మల్యాల సుజిత్ కుమార్, వెన్నం రజిత రెడ్డి, వంగల విద్యాసాగర్, మునిగంటి అనిల్, కామెడ్డి రాంరెడ్డి,మామిడి సత్యనారాయణ రెడ్డి, చర్ల పద్మ, గుండాటి శ్రీనివాసరెడ్డి, చింతల కిషన్, లింగంపల్లి బాబు, పొన్నం మధు, మూల జైపాల్, అబ్దుల్ రహమాన్, అమీర్, ముక్క భాస్కర్, రాచర్ల పద్మ, ఇమ్రాన్, ఫహద్, దన్ను సింగ్, ఇమ్రాన్ని, హైమద్, కంకణాల అనిల్ కుమార్, సలీముద్దీన్, కీర్తి కుమార్, రోళ్ళ సతీష్, కుంభాల రాజకుమార్, మాదాసు శ్రీనివాస్, కుర్ర పోచయ్య, బొబ్బిలి విక్టర్,తోట అంజయ్య, స్వప్నశ్రీ, కపిల్ మాధవ్, మంద మహేష్, షహెన్నా, శ్రీరాముల రమేష్, శిల్ప, లాయికు, సిరిపురం మనోజ్, కలీం, ఎస్ఏ మోసిన్, హాజీ, కిరణ్ రెడ్డి, కర్రె పావని, అబ్దుల్ బారి, వసీం, సత్తినేని శ్రీకాంత్, షబానా, సుంకరి గణపతి, బత్తిని చంద్రయ్య గౌడ్, హస్తపురం తిరుమల, వీర దేవేందర్, గడప అజయ్, చాంద్, రంగా నాయక్, ఫజల్, కోలా గాని అనిల్, బషీరుద్దీన్, కలీముద్దీన్, అశోక్ రెడ్డి, గంగుల దిలీప్, మిరాజ్, చెల్లోజు రాజు, పెంటశేఖర్, ఊకంటి రవీందర్ రెడ్డి, గడ్డం శ్రీరామ్, అందె శంకర్, నాగుల సతీష్, మార్కరాజు తదితరులు పాల్గొన్నారు

## సంస్కరణల సృష్టికర్త రాజీవ్ గాంధీ

**ముద్ర, కోరుట్ల:** సంస్కరణలకు సృష్టికర్త రాజీవ్ గాంధీ అని కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు అన్నారు. బుధవారం రోజు దివంగత మహానేత మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా జువ్వాడి భవన్ లో ఆయన చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు కృష్ణారావు, కోరుట్ల మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుమల గంగాధర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పన్నాల అంజిరెడ్డి, మాజీ అధ్యక్షులు కొంతం రాజం, మున్సిపల్ వైస్ చైర్మన్ షాహిద్, ఏలేటి మహిపాల్ రెడ్డి కౌన్సిలర్లు, వివిధ హోదాల నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

## పండుగ సాయన్న జయంతి, వర్ధంతికి ప్రభుత్వ గుర్తింపు

**ముద్ర, హైదరాబాద్:** ప్రజా వీరుడు పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి, వర్ధంతులను ఇకపై రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో అధికారికంగా నిర్వహించేందుకు తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. G.O.Rt.No.1217 ప్రకారం అక్టోబర్ 22న జయంతి, డిసెంబర్ 10న వర్ధంతిని ప్రతి సంవత్సరం రాష్ట్ర కార్యక్రమాలుగా నిర్వహించనున్నారు. అన్ని జిల్లాల కలెక్టర్లు కార్యక్రమాలు చేపట్టాలని, బీసీ సంక్షేమ శాఖను నోడల్ శాఖగా ప్రభుత్వం నియమించింది. ఈ నిర్ణయాన్ని ముదిరాజ్ సమాజం స్వాగతించింది. ఇది ముదిరాజుల చరిత్ర, ఆత్మగౌరవం, ఐక్యతకు లభించిన గౌరవమని తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులు గొడుగు శ్రీనివాసు ముదిరాజ్ పేర్కొన్నారు.

# దేశ భవితకు పునాది వేసిన నేత రాజీవ్ గాంధీ..

**ప్రపంచం గర్వించే విధంగా భారతదేశాన్ని నడిపించిన నాయకులు..**
**దేశ ప్రజల కోసం ప్రాణ త్యాగాలు చేసిన కుటుంబం..**
**రాజీవ్ గాంధీ జయంతి వేడుకల్లో పాల్గొన్న మంత్రి అడ్లూరి..**

**ముద్ర , ధర్మపురి:** నేడు ప్రపంచ దేశాలతో పోటీపడి ప్రపంచం గర్వించే విధంగా భారతదేశం ఎదగడానికి కారణం దివంగత నేత, మాజీ ప్రధాని శ్రీ రాజీవ్ గాంధీ అని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా ధర్మపురి మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్మపురి పట్టణంలోని నంది చౌరస్తాలో నిర్వహించిన జయంతి వేడుకల్లో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడు తూ రాజీవ్ గాంధీ ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో భారత దేశానికి కంప్యూటర్లను పరిచయం చేశారని అన్నారు. వారి స్ఫూర్తితో మొదలైన కంప్యూటర్ ఈరోజు సాఫ్ట్ వేర్ రంగంలో భారతదేశానికి ప్రపంచ స్థాయి గుర్తింపు వచ్చిందని అన్నారు. లక్షలాదిమంది నైపుణ్యం పెంచుకొని ప్రపంచ దేశాల్లో సాఫ్ట్ వేర్ రంగాల్లో స్థిరపడ్డారని గుర్తు చేశారు.

దేశ భవిష్యత్తును నిర్ణయించే యువత కు ఎన్నికల్లో అవకాశం కల్పించాలని ఓటు హక్కు వయసు 21 ఏళ్ల నుంచి 18 ఏళ్లకు తగ్గించి భారతదేశ ప్రజాస్వామ్యం లో యువతను భాగస్వాములను చేశారని అన్నారు. దేశ ఐక్యత కోసం రాజీవ్ గాంధీ గారు అనేక కార్యక్రమాలు నిర్వహించి ముందుకు సాగారని మంత్రి లక్ష్మణ్ కుమార్ గుర్తు చేశారు. దేశ ప్రజల కోసం ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ వంటి మహనీయులు ప్రాణ త్యాగాలు చేశారని మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. నేటి యువత రాజీవ్ గాంధీని స్ఫూర్తిగా తీసుకొని దేశ ఐక్యతకు సమగ్రతకు పాటుపడాలని మంత్రి పిలుపునిచ్చారు.



ధర్మపురి మున్సిపల్ చైర్మన్ వేముల నాగలక్ష్మి, జగిత్యాల జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంఘనపట్ల దినేష్ తో పాటు ధర్మపురి మున్సిపల్ కౌన్సిల ర్లు, కాంగ్రెస్ నాయకులు వేముల రాజు, సౌళ్ల భీమన్న తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వం..

**జగిత్యాల జిల్లాలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పర్యటన విజయవంతం చేయండి..**
**రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్..**

**ముద్ర, జగిత్యాల:** కాంగ్రెస్ ప్రభుత్వం పేద మధ్యతరగతి ప్రజల ప్రభుత్వం అని వారికి అండగా నిలవడమే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రధాన లక్ష్యం అని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. గురువారం జగిత్యాల జిల్లా నూకపల్లిలోని డబుల్ బెడ్రూం ఇళ్లను మంత్రి లక్ష్మణ్ కుమార్ జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్, రాష్ట్ర వెలమ సంక్షేమ సంఘం కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నరసింగారావు లతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి మాట్లాడుతూ జగిత్యాల జిల్లా నూక పల్లిలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు మౌలిక సదుపాయాలు లేక పేదలు పడుతున్న ఇబ్బందులను గమనించి జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మౌలిక వసతుల కల్పనకు ప్రతిపాదన పంపించారని మంత్రి తెలిపారు.

ఎమ్మెల్యే గారి సిఫారసు మేరకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 62 కోట్లు కేటాయించిందని మంత్రి వివరించారు. నూక పల్లి డబుల్ బెడ్ రూమ్ పిల్లలు పేద మధ్యతరగతి వారు ఉండటంతో వారికి సౌకర్యాలు కల్పించడానికి నిధులు విడుదల చేసినట్లు మంత్రి తెలిపారు. ప్రభుత్వంపై ఆర్థిక భారం ఉన్నప్పటికీ పేదల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ఎక్కడ వెనకడుగు వేయడం లేదని మంత్రి తెలిపారు.



**మంత్రి పర్యటనను విజయవంతం చేయండి..**

తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శుక్రవారం జగిత్యాల జిల్లాలో పర్యటించనున్నట్లు మంత్రి అడ్లూరి తెలిపారు.నిజామాబాద్ జిల్లా పర్యటన ముగించు కొని మధ్యాహ్నం 12 గంటలకు జగిత్యాల జిల్లాకు చేరుకొని ధరూర్ క్యాంప్ వద్ద జగిత్యాల జిల్లా లో నూతనంగా మంజూరైన జగిత్యాల, మెట్ పల్లి రెవెన్యూ డివిజనల్ కార్యాలయాలు, భీమారం, ఎండపల్లి మండలాల తహసీల్దార్ కార్యాలయాలు, మాల్యాల, మెట్ పల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల భవనాలకు మంత్రి శంకుస్థాపన చేయనున్నారని మంత్రి అడ్లూరి తెలిపారు.

అనంతరం మధ్యాహ్నం ఒంటిగంటకు నూక పల్లి డబుల్ బెడ్ రూమ్ పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడతారని మంత్రి వివరించారు. అనంతరం జగిత్యాలలోని పద్మనాయక ఫంక్షన్ హాల్ లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో మంత్రి ముఖాముఖి కార్యక్రమం నిర్వహించనున్నట్లు మంత్రి తెలిపారు.

సాయంత్రం 4:30 గంటలకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా కలెక్టర్లతో గృహ నిర్మాణం, రెవెన్యూ అంశాలపై సమీక్షా సమావేశం జగిత్యాల జిల్లా కలెక్టరేట్ నిర్వహించనున్నట్లు మంత్రి వివరించారు. మంత్రి పర్యటన సందర్భంగా సంబంధిత శాఖల అధికారులు అవసరమైన ఏర్పాట్లు సమన్వయంతో చేపట్టాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ కు మంత్రి సూచించారు.

# రాంచందర్ రావు,బండి సంజయ్ వాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం

**స్వతంత్రోద్యమంతో సంబంధం లేని బీజేపీ పార్టీ ప్రాణత్యాగం చేసిన గాంధీ కుటుంబం పై బురుదజల్లాలని కుట్ర చేస్తుంది**
**సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ఫైర్**

**ముద్ర, కరీంనగర్ :** స్వాతంత్రోద్యమంతో సంబంధం లోని బీజేపీ పార్టీ దేశం కోసం ప్రాణత్యాగం చేసిన గాంధీ కుటుంబం పై బురుద జల్లాలని చూస్తుందని సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మండిపడ్డారు.స్థానిక మాజీ సు డా చైర్మన్ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1950 లో భారత జాతీయ కాంగ్రెస్ వందేమాతరం గీతాన్ని జాతీయ గీతంగా ఆమోదించిందని,1951 లో జనసంఘ్ పార్టీ ఆవిర్భవించిందని 1980 లో జనసంఘ్ భారతీయ జనతా పార్టీ అయ్యిందని బీజేపీకి కాంగ్రెస్ పార్టీని గానీ కాంగ్రెస్ నాయకులను గానీ విమర్శించే నైతిక హక్కు లేదని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు.సోనియా గాంధీ, మల్లిఖార్జున ఖర్గే ల పై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు,కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను నరేందర్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. రెండు సార్లు ప్రధాన మంత్రి గా అవకాశం వచ్చినా సున్నితంగా సోనియా గాంధీ తిరస్కరించారని ఓటమెరుగని నిబద్ధతగల ప్రజా నాయకులు మల్లికార్జున ఖర్గే అని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు.కేంద్ర ప్రభుత్వం వైఫల్యాన్ని ప్రశ్నించిన విద్యార్థులపై దమనకాండ జరిపిన బీజేపీపై దేశ వ్యాప్తంగా విద్యార్థులు ఆగ్రహంతో ఉన్నారని ఫీజురీయిం బర్స్ మెంట్ పేరుమీద మొసలి కన్నీరు కారుస్తున్నారని 10 సంవత్స రాలు బీఆర్ఎస్ పార్టీతో అంటకాగి 8 లక్షల కోట్ల అప్పుకు కారణం బీజేపీ కూడా కారణమని అప్పుడు ఫీజు రీయింబర్స్ మెంట్ ఒక్క రూపాయి ఇవ్వకున్నా పెదవులు తెరవలేదని నరేందర్ రెడ్డి మండిపడ్డారు.సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాల మోడీ హామీ ఏమైందని ఎన్ని ఇబ్బందులున్నా కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే 70 వేల ఉద్యోగాలు భర్తీ చేసిం దని నరేందర్ రెడ్డి అన్నారు. పర్వతం మల్లేశం,గుండాటి శ్రీనివాస్ రెడ్డి,కుర్ర పోచయ్య,జీడి రమేష్,ముక్క భాస్కర్,లయక్, మూల కృష్ణారెడ్డి,పెద్దిగారి తిరుపతి,మేకల నర్సయ్య,మామిడి సత్యనారాయణ రెడ్డి,తోట అంజయ్య,గుడిపాటి రమణా రెడ్డి,షెహెన్ష,ఖలీల్,బత్తుల రాజ్ కుమార్ పాల్గొన్నారు.




# పోలీస్ స్టేషన్లను పరిశీలించిన డీఐజీ

**ముద్ర, కరీంనగర్:** వార్షిక తనిఖీల్లో భాగంగా కాళేశ్వరం జోన్ డీఐజీ అంబర్ కిశోర్ ఝా, ఐపీఎస్ భూపాలపల్లి జిల్లాలోని కొయ్యూరు పోలీస్ స్టేషన్, మహాదేవపూర్ సీఐ కార్యాలయాన్ని సమగ్రంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ డీఐజీకి స్వాగతం పలికారు.తనిఖీలో భాగంగా పోలీస్ స్టేషన్, సర్కిల్ కార్యాలయాల పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, మాల్ఖానా, ఆయుధాగారం, సిబ్బంది టర్న్అవుట్, క్రమశిక్షణ, యూనిఫాం నిర్వహణ, సీసీటీవీ వ్యవస్థ పనితీరును పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడి విధి నిర్వహణ, పనితీరు, సంక్షేమ అంశాలను తెలుసుకున్నారు.

ప్రజలకు పారదర్శకమైన, సమర్థవంతమైన పోలీస్ సేవలు అందించాలని డీఐజీ సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణ, విజిబుల్ పోలీసింగ్, నిఘా పెట్రోలింగ్, కమ్యూనిటీ పోలీసింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. CCTNS 2.0, e-Sakshya, డిజిటల్ ఫోరెన్సిక్స్, సైబర్ దర్యాప్తు, సోషల్ మీడియా మానిటరింగ్ వంటి ఆధునిక సాంకేతికతపై సిబ్బంది నైపుణ్యాలు పెంచుకోవాలని సూచించారు.

డ్రగ్స్, గంజాయి, సైబర్ నేరాలు, ట్రాఫిక్, రౌడీషీటర్లు, హిస్టరీషీటర్లపై నిరంతర నిఘా కొనసాగించాలని, మహిళలు, చిన్నారులు, వృద్ధుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. అనంతరం పర్యావరణ పరిరక్షణలో భాగంగా పోలీస్ స్టేషన్, సీఐ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కాటారం డీఎస్పీ సూర్యనారాయణ, కాటారం సీఐ నాగార్జునరావు, మహాదేవపూర్ సీఐ వెంకటేశ్వర్లు, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
శుక్రవారం 21.08.2026
www.mudranews.in | @mudranews



**వరలక్ష్మీ వ్రతం సందర్భంగా**

అమ్మవారికి ప్రత్యేక పూజ చేయాలి. పసుపు, కుంకుమ, పూలు, అక్షింతలు సమర్పించి లక్ష్మీదేవికి అష్టోత్తర శతనామావళి లేదా శ్రీ సూక్తం పారాయణం చేయాలి.



# 25 ఏళ్ల ప్రజా ప్రస్థానానికి ఘన సన్మానం



**ముద్ర, మక్తల్:** ప్రజా జీవితంలో 25 ఏళ్ల రాజకీయ ప్రస్థానం పూర్తి చేసుకున్న రాష్ట్ర పశుసంవర్ధక, పాడిపరిశ్రమాభివృద్ధి, మత్స్య, క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరిని మంత్రి సీతక్క ఘనంగా సన్మానించారు. గురువారం మక్తల్‌లోని ద్వారక ఫంక్షన్‌హాల్‌లో జరిగిన కార్యక్రమంలో శ్రీహరికి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేశారు.ఈ సందర్భంగా మక్తల్ నియోజకవర్గంలో సుమారు రూ.273 కోట్లతో చేపట్టిన 25 అభివృద్ధి పనులకు మంత్రులు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. రహదారులు, ఆసుపత్రులు, క్రీడా మైదానాలు, విద్యాసంస్థలు, సాగునీరు, విద్యుత్, గ్రామీణ మౌలిక వసతులకు సంబంధించిన పనులకు శ్రీకారం చుట్టారు.2001లో రాజకీయ ప్రస్థానంమంత్రి శ్రీహరి మాట్లాడుతూ 2001 ఆగస్టు 20న తన రాజకీయ ప్రస్థానం ప్రారంభమైందని, ప్రజల ఆశీర్వాదం, కార్యకర్తల అండదండలతో 25 ఏళ్ల ప్రజా జీవితాన్ని పూర్తి చేసుకున్నానని తెలిపారు. వార్డు మెంబర్ స్థాయి నుంచి అనేక పదవులు చేపట్టి ఈ స్థాయికి వచ్చానని, తన బలం, బలహీనత కార్యకర్త లేనన్నారు. ప్రజల కోసం రోజుకు 18 గంటలు పనిచేస్తున్నానని చెప్పారు. రాబోయే రెండున్నరేళ్లలో మక్తల్ నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని మరింత అభివృద్ధి చేయడమే లక్ష్యమన్నారు.ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మక్తల్‌లో రైతులు, మహిళలు, పేదలు, విద్యార్థులు, కార్మికులు, వెనుకబడిన వర్గాల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని వివరించారు. రైతు రుణమాఫీ కింద 33,788 మంది రైతులకు రూ.363 కోట్లు, రైతు భరోసా కింద 92,949 మంది రైతులకు రూ.153.52 కోట్లు అందించినట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా 5,500 కుటుంబాలకు రూ.275 కోట్ల మేర ప్రయోజనం కల్పిస్తున్నామని చెప్పారు. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ ద్వారా 3,942 కుటుంబాలకు రూ.39.46 కోట్ల సాయం అందించామన్నారు.అభివృద్ధికి పెద్దపీటమక్తల్, ఆత్మకూర్, అమరచింత, ఉట్కూర్, నర్వ, కృష్ణ, మాగనూర్ మండలాల్లో రహదారులు, ఆసుపత్రులు, విద్యాసంస్థలు, అంగన్‌వాడీ భవనాలు, క్రీడా మైదానాలు, విద్యుత్ సబ్‌స్టేషన్లు, సాగునీటి ప్రాజెక్టులు తదితర పనులు చేపడుతున్నట్లు మంత్రి తెలిపారు. 49 గ్రామ పంచాయతీ భవనాలకు రూ.9.80 కోట్లు, 24 అంగన్‌వాడీ భవనాలకు రూ.2.88 కోట్లు, 72 మహిళా సంఘ భవనాలకు రూ.7.20 కోట్లు కేటాయించినట్లు వివరించారు.శ్రీహరి ప్రస్థానం ఆదర్శంమంత్రి సీతక్క మాట్లాడుతూ శ్రీహరి 25 ఏళ్లుగా ప్రజల కోసం కష్టపడి ఈ స్థాయికి ఎదిగారని, ఆయన రాజకీయ ప్రస్థానం ఆదర్శమన్నారు. మక్తల్ అభివృద్ధికి సుమారు రూ.1,800 కోట్ల మేర నిధులు తీసుకురావడానికి శ్రీహరి కృషి చేశారని తెలిపారు. 25 ఏళ్ల కష్టానికి మంత్రి పదవి దక్కడం ఆయన ప్రజా జీవితానికి సార్థకత అన్నారు.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం వెనుకబడిన నియోజకవర్గాలను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తోందని చెప్పారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా, ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, సన్నబియ్యం వంటి సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. మక్తల్‌ను రాష్ట్రంలో ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, ప్రజలు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# 'భూ భారతి'తో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

**మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**
**త్వరలోనే భూధార్ కార్డులు**
**వచ్చే ఏడాదిన్నరలో రాష్ట్రవ్యాప్తంగా రీ సర్వే పూర్తి**




**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, ఆగస్టు 20:** రాష్ట్రంలోని రైతుల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే 'భూ భారతి' చట్టం యొక్క ముఖ్య లక్ష్యమని, రైతుల భూ హక్కులను పరిరక్షించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధి, నిజాయితీతో పనిచేస్తోందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. సత్తుపల్లి మండల పరిధిలోని నారాయణపురం గ్రామంలో నిర్వహించిన కడాస్ట్రల్, నాన్-కడాస్ట్రల్ గ్రామాల భూ రీ సర్వే ప్రత్యేక అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్‌తో కలిసి మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బేతుపల్లి రెవెన్యూ పరిధిలోని 12,047 ఎకరాల భూమికి గాను గత 25 రోజుల్లో 6 వేల ఎకరాల రీ సర్వే పూర్తయిందని, మిగిలిన భూమికి కూడా త్వరలోనే పూర్తి చేస్తామని తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ప్రతి రైతు భూమికి ఖచ్చితమైన కోఆర్డినేట్లు, మ్యాప్ రూపొందిస్తున్నట్లు చెప్పారు. రీ సర్వే ముగిసిన తర్వాత 30 రోజుల పాటు రైతుల నుంచి అభ్యంతరాలను స్వీకరిస్తామని, ఆ లోపాలను సరిదిద్దిన తర్వాతే తుది హక్కులను నమోదు చేస్తామని వెల్లడించారు. మనుషులకు ఆధార్ కార్డులు ఉన్నట్లే, రైతుల భూములకు 'భూధార్' కార్డులు అందజేస్తామని, రాబోయే ఏడాదిన్నర కాలంలో రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ భూములు, ఆబాది ఆస్తుల రీ సర్వే ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని పేర్కొన్నారు. గతంలో నాగార్జున సాగర్ పైలట్ ప్రాజెక్ట్ సర్వేలో బయటపడిన 3,400 వరకు నకిలీ పాస్ బుక్కుల ఉదంతాన్ని గుర్తుచేస్తూ, అర్హులైన నిజమైన రైతులకు మాత్రమే పూర్తి భూ హక్కులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ప్రజాప్రతినిధులు, అధికారులు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

**విద్య, వైద్య రంగానికి పెద్దపీట**

ప్రజారోగ్యం, విద్యారంగాల బలోపేతానికి తమ ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యమిస్తోందని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. కలెక్టర్ దివాకర టీఎస్‌తో కలిసి సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలో రూ. 1.83 కోట్ల వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణ పేదలకు నాణ్యమైన ఉచిత ప్రాథమిక వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా ఎన్టీఆర్ నగర్‌లో రూ. 1.43 కోట్ల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించిన అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ భవనాన్ని ప్రారంభించినట్లు చెప్పారు. శివసాయి నగర్‌లో రూ. 40 లక్షల నిధులతో నిర్మించనున్న మల్టీపర్పస్ మున్సిపల్ కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు భూమిపూజ చేసి శంకుస్థాపన చేశారు. స్థానిక ప్రజల సామాజిక కార్యకలాపాలకు, శుభకార్యాలకు ఈ భవనం ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. విద్య, వైద్యం, మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# నిరుద్యోగ సమస్యపై భగ్గుమన్న సీపీఎం

**ఖమ్మం కలెక్టరేట్ ఎదుట కామ్రేడ్‌ల 'మహాధర్నా'**




**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, ఆగస్టు 20 :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విభాగాలు, శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ నిరుద్యోగ యువతతో కలసి ఖమ్మం జిల్లా కలెక్టరేట్ ఎదుట సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. పార్టీ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై. విక్రమ్ అధ్యక్షతన కలెక్టరేట్ ధర్నా చౌక్ వద్ద ఈ కార్యక్రమం జరిగింది.ఈ ధర్నాను ఉద్దేశించి సీపీఎం ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యాయని మండిపడ్డారు. ప్రతి ఏటా 2 కోట్ల ఉద్యోగాలిస్తామని కేంద్రంలోని మోదీ ప్రభుత్వం, అధికారంలోకి వస్తే ఏటా 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని 'యూత్ డిక్లరేషన్' ద్వారా రాష్ట్రంలోని రేవంత్ రెడ్డి సర్కారు హామీ ఇచ్చి నిరుద్యోగులను మోసం చేశాయని విమర్శించారు. మోదీ ప్రభుత్వం వీధి వ్యాపారాన్ని కూడా ఉద్యోగంగా లెక్కించడం యువతపై వారికి ఉన్న శ్రద్ధకు నిదర్శనమని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఉద్యోగాలు మొత్తం కలిపినా 60 వేలకు మించడం లేదని పేర్కొన్నారు.ప్రపంచంలోనే అత్యధిక యువత కలిగిన భారత దేశంలో కొత్త నియామకాలు, కర్మాగారాల స్థాపన ద్వారా ఉపాధి అవకాశాలు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాల తీరు మారకపోతే అన్ని వర్గాలు, నిరుద్యోగ యువతను కలుపుకొని దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు, ధర్నాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకులు పొన్నం వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాచర్ల భారతి, బొంతు రాంబాబు, భూక్యా వీరభద్రం, మాదినేని రమేష్, యర్రా శ్రీనివాసరావు, బండి పద్మతో పాటు పార్టీ జిల్లా కమిటీ సభ్యులు, విద్యార్థి, యువజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## న్యూ డెమోక్రసీ విద్వేష ప్రచారాన్ని ఆపాలి

**సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ డిమాండ్**
**ఏ రకమైన విచారణకైనా మేం సిద్ధం**
**పోటు రంగారావు**




**ముద్ర ప్రతినిధి,ఖమ్మం, ఆగస్టు 20 :** సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ పార్టీపై న్యూ డెమోక్రసీ (వైకే) వర్గం చేస్తున్న దుష్ప్రచారాన్ని, విద్వేష పూరిత వ్యాఖ్యలను తక్షణమే ఆపాలని మాస్ లైన్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కేజీ రామచందర్, కే రంగయ్య డిమాండ్ చేశారు. ఖమ్మంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రెండేళ్ల క్రితం జరిగిన రాయల చంద్రశేఖర్ అర్ధాంతర మరణం పార్టీని, ప్రజాస్వామిక శ్రేణులను కలచివేసిందని పేర్కొన్నారు. వ్యక్తిగత, కుటుంబ సమస్యలతో మనస్తాపానికి గురై ఆయన ఆ నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. ఈ విషయాన్ని ఇప్పుడు న్యూ డెమోక్రసీ నాయకులు పథకం ప్రకారం హత్యగా చిత్రీకరిస్తూ పార్టీపై బురద జల్లేందుకు కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. సగం కత్తిరించిన వీడియోలు, రైలు కూతల సౌండ్ ఎఫెక్ట్‌లతో నాటకమాడుతూ ప్రజాస్వామిక శ్రేణులను మభ్యపెట్టాలని చూస్తున్నారని మండిపడ్డారు. రాయల చంద్రశేఖర్ మరణం పై స్వతంత్ర ప్రజాస్వామిక శక్తులతో గానీ, లేదా రెండు పార్టీల ఉమ్మడి బృందంతో గానీ ఏ రకమైన విచారణకైనా తమ పార్టీ సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. దేశంలో బీజేపీ, ఆర్ఎస్ఎస్‌ల నుంచి రాజ్యాంగ హక్కులకు ప్రమాదం పొంచి ఉన్న ప్రస్తుత తరుణంలో కమ్యూనిస్టు శక్తులన్నీ ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. ఇలాంటి సమయంలో శవ రాజకీయాలు, కుటిల యత్నాలు చేయడం మానుకోవాలని న్యూ డెమోక్రసీ నాయకత్వానికి హితవు పలికారు. సమావేశంలో నాయకులు వి. ప్రభాకర్, గుమ్మడి నర్సయ్య, చంద్ర అరుణ, సీవై పుల్లయ్య, ఆవుల వెంకటేశ్వర్లు, ఆవుల అశోక్, టీ ఝాన్సీ, పి. శోభ పాల్గొన్నారు.

## బోనాల పండుగకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి



**కమిషనర్ కు వినతి**

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** ఈనెల 22, 23న భువనగిరి పట్టణంలో ముదిరాజ్ ఇతర కులస్తుల బోనాల పండుగ సందర్భంగా వార్డులలోని దేవాలయాలలో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని భువనగిరి మున్సిపల్ కమిషనర్ చంద్రప్రకాష్ రెడ్డికి ముదిరాజ్ కుల సంఘం ఆధ్వర్యంలో గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 22న శనివారం పెద్దమ్మ తల్లి బోనాల సందర్భంగా కిసాన్ నగర్ లోని పెద్దమ్మ తల్లి ఆలయం వద్ద భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని కోరారు. 23న ఆదివారం అన్ని వార్డులలో గల దేవతలకు బోనాల సందర్భంగా ఆయా దేవాలయాలలో భక్తులకు సౌకర్యాలు కల్పించాలని పేర్కొన్నారు. 29న బహార్ పేట్, ఎల్బీనగర్ పెద్దమ్మతల్లి బోనాలు, 30న ఇతర దేవతల బోనాలను పురస్కరించుకొని ఆయా దేవాలయాల వద్ద ప్రత్యేక ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి డెలిగేట్ తంగళ్ళపల్లి రవికుమార్, ముదిరాజ్ సంఘం పట్టణ అధ్యక్షులు ఎనబోయిన జహంగీర్, పట్టణ ప్రధాన కార్యదర్శి నీల శ్రీనివాస్, నాయకులు కుక్కదూవ్వ సోమయ్య, ఉడుత భాస్కర్, తుమ్మల నగేష్, పిట్టల బాలరాజ్, పోలిశెట్టి అనిల్ కుమార్ పాల్గొన్నారు.

## మల్లయ్య కుటుంబానికి ఆర్థికసాయం



**ముద్ర, తుంగతుర్తి;** తుంగతుర్తి మండల పరిధిలోని వెంపటి గ్రామానికి చెందిన పొన్నం మల్లయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన కుటుంబానికి అండగా నిలిచేందుకు మల్లయ్య పెద్ద కుమారుడి 10వ తరగతి స్నేహితులు ముందుకు వచ్చారు.తమ స్నేహబంధాన్ని చాటుకుంటూ మిత్రులంతా కలిసి రూ.13,000 ఆర్థిక సహాయాన్ని మల్లయ్య కుటుంబ సభ్యులకు గురువారం అందజేశారు. ఆపద సమయంలో కుటుంబానికి అండగా నిలిచిన స్నేహితుల ఔదార్యాన్ని గ్రామస్థులు అభినందించారు.

## కస్తూర్బాలో వర్షాకాల వ్యాధులపై అవగాహన



**ముద్ర, తుంగతుర్తి:** తుంగతుర్తి కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో పీహెచ్‌సీ రావులపల్లి ఆధ్వర్యంలో వర్షాకాల వ్యాధుల నివారణపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. వైద్యాధికారి డాక్టర్ లింగమూర్తి మాట్లాడుతూ పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా వంటి వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. శుభ్రమైన నీరు, ఆహారం తీసుకోవడంతో పాటు భోజనానికి ముందు, మరుగుదొడ్డి వినియోగం తర్వాత చేతులు సబ్బుతో కడుక్కోవాలని తెలిపారు. విద్యార్థినులకు ఐరన్–ఫోలిక్ యాసిడ్ మాత్రలు పంపిణీ చేసి పోషకాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వి. వసంత, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## యూరియాను ఎమ్మార్పీ ధరకే విక్రయించాలి



**ముద్ర, తుంగతుర్తి:** సింగిల్ విండోలలో యూరియాను ఎమ్మార్పీ ధరకే విక్రయించాలని, రైతులపై రవాణా చార్జీల భారం మోపే ప్రభుత్వ సర్క్యులర్‌ను వెంటనే రద్దు చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య డిమాండ్ చేశారు.రవాణా చార్జీల పేరుతో ప్రాంతాన్ని బట్టి ఒక్కో యూరియా బస్తాపై రూ.33 నుంచి రూ.67 వరకు అదనపు భారం పడుతోందని అన్నారు. గతంలో మార్క్‌ఫెడ్ ద్వారా రవాణా చార్జీలు లేకుండా ఎమ్మార్పీ ధరకే ఎరువులు అందించేవారని గుర్తుచేశారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే సర్క్యులర్‌ను రద్దు చేయాలని కోరారు.కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గునిగంటి యాదగిరి, కడారి దాసు, అన్నెబోయిన సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## బస్వాపురం ప్రాజెక్టుకు పూర్తిస్థాయిలో నిధులు కేటాయించాలి



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి:** బస్వాపురం ప్రాజెక్టు పూర్తిస్థాయి నిర్మాణానికి ప్రభుత్వం తక్షణమే నిధులు కేటాయించి విడుదల చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ డిమాండ్ చేశారు. ప్రాజెక్టులో ప్రస్తుతం ఉన్న నీటిని విడుదల చేసి వర్షాభావంతో ఎండిపోతున్న వరి పొలాలను ఆదుకోవాలని కోరారు.ముత్తిరెడ్డి గూడెంలో జరిగిన సీపీఎం గ్రామ శాఖ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు, కాలువలను పూర్తి చేస్తే వ్యవసాయం అభివృద్ధి చెంది రైతులు, కూలీలు, వృత్తిదారులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అన్నారు.పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలని కోరుతూ ఈ నెల 29, 30, 31 తేదీల్లో భువనగిరి నుంచి హైదరాబాద్ ఇంద్రపార్క్ వరకు సీపీఎం నిర్వహించే పాదయాత్ర, 31న మహాధర్నాలో రైతులు, వ్యవసాయ కూలీలు, వృత్తిదారులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

## డబుల్ రోడ్డుకు శంకుస్థాపన

**ముద్ర, సూర్యాపేట, ఆగస్టు 20:** చింతలపాలెం మండలంలో పలు అభివృద్ధి పనులకు రాష్ట్ర నీటిపారుదల, ఆహార పౌరసరఫరాల శాఖ మంత్రి నల్లమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి గురువారం శ్రీకారం చుట్టారు. అడ్లూరు ఆర్‌అండ్‌ఆర్ సెంటర్‌లో రూ.23 కోట్లతో మేళ్లచెరువు నుంచి చింతిర్యాల వరకు చేపట్టనున్న డబుల్ రోడ్డుకు శంకుస్థాపన చేశారు.రేబల్లెలో రూ.20 లక్షలతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనం, రూ.10 లక్షలతో నిర్మించిన మహిళా శక్తి భవనాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని మారుమూల గ్రామాలు, పంచాయతీలు, తండాలకు నూతన రహదారులు వేస్తున్నామని తెలిపారు. గ్రామ పంచాయతీలకు నూతన భవనాలు మంజూరు చేస్తున్నామని, వాటిని పరిశుభ్రంగా నిర్వహించుకోవాలని సూచించారు.మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు ప్రభుత్వం వడ్డీలేని రుణాలు అందిస్తోందని, వాటితో దుకాణాలు, డెయిరీలు ఏర్పాటు చేసుకుని ఆదాయం పెంచుకోవాలని సూచించారు. మహిళా శక్తి భవనాలను మహిళా సంఘాల సమావేశాలకు వినియోగించుకోవాలని అన్నారు.కార్యక్రమంలో కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్, ఎస్పీ కే. నరసింహ, ఆర్‌అండ్‌బీ ఈఈ సీతారామయ్య, డీఆర్‌డీఓ పీడీ సన్యాసయ్య, ఆర్డీవో శ్రీనివాసులు, సర్పంచులు నాగిరెడ్డి, మాధవి, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రాజెక్టులకు నిధుల సాధనకై పాదయాత్ర



**ముద్ర, బీబీనగర్ :** జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్ట్ లకు నిధులు విడుదల చేసి, ప్రాజెక్టు లు పూర్తి చెయ్యాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 29,30,31 తేదీలలో సిపిఎం పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పాదయాత్ర, 31 న చలో హైద్రాబాద్ ఇందిరా పార్క్ లో జరిగే మహాధర్నా లో అధిక సంఖ్యలో రైతులు కూలీలు ప్రజలు కార్మికులు పాల్గొని జయప్రదం చెయ్యాలని సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కోమటిరెడ్డి చంద్రారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం బీబీనగర్ మండల కేంద్రంలో ముద్రించిన కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి బండారు శ్రావణ్ కుమార్, మండల కమిటి సభ్యులు పొట్ట యాదమ్మ, పట్టణ కార్యదర్శి బండారు శ్రీరాములు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి గాడి శ్రీనివాస్, పంజాల జంగయ్య, పొట్ట చిన్న నరసమ్మ, నోముల ఎల్లారెడ్డి, పొన్నాల మహేష్, బరిగే గణేష్ , బోల్ల నరసింహ, బరిగె ఈశ్వరయ్య పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
శుక్రవారం 21.08.2026
www.mudranews.in | @mudranews



**వరలక్ష్మీ వ్రతం సందర్భంగా**

ఇంటిని శుభ్రం చేయాలి:వ్రతం రోజున ఉదయాన్నే తలస్నానం చేసి ఇంటిని, పూజా మందిరాన్ని శుభ్రం చేసి ముగ్గులతో అలంకరించాలి.



# ఘనంగా 82వ రాజీవ్ గాంధీ జయంతి

**ముద్ర, దేవరకొండ:**దేవరకొండ పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ ప్రధానమంత్రి, భారతరత్న రాజీవ్ గాంధీ 82వ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. దేవరకొండ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం (మార్కెట్ ఆఫీస్)లో నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా దేశానికి రాజీవ్ గాంధీ అందించిన సేవలను, ఆయన ప్రవేశ పెట్టిన సంస్కరణలను నాయకులు స్మరించుకున్నారు. యువత, సాంకేతిక రంగాల అభివృద్ధికి రాజీవ్ గాంధీ చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎం.డి. రయిస్, మాజీ సర్పంచ్ పున్నా వెంకటేష్, మాజీ కౌన్సిలర్ బత్తుల అమర్, ఉమర్ ఖాసిం, సమీర్, బుషారాజు, రాములు, మహమ్మద్ కైసర్, మహమ్మద్ ఇక్రమొద్దీన్, రఘు, గౌడ్, విజయ్, సన్ని, శివ నేతల శ్రీను తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు







### రాజీవ్ చేసిన సేవలు మరువలేనివి

**ముద్ర, తుంగతుర్తి:** భారతదేశానికి స్వర్గీయ మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ చేసిన సేవలు మరువలేనివని ఆయన స్ఫూర్తితో యువత అభివృద్ధి వైపుకు సాగాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు రేగటి రవి గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం మెయిన్ రోడ్డు పై మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతిలో భాగంగా, చిత్ర పటానికి పూలమాలవేసి, ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఐటీ శాఖ అభివృద్ధికి ఎంతో కృషి చేసినాడు, అని కొనియాడారు. దేశంలో బహులార్ధక సాధక ప్రాజెక్టులన్ని కాంగ్రెస్ హయాంలోనే కట్టడాలు జరగాలని గుర్తు చేశారు. తుమతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు నియోజకవర్గ అభివృద్ధి కోసం సుమారు 2000 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు కొనసాగుతున్నట్టు పేర్కొన్నారు. రానున్న స్థానిక ఎన్నికల్లో ఐకమత్యంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేసి, అత్యధిక స్థానాలు కాంగ్రెస్ పార్టీ పొందే విధంగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, పిఎసిఎస్ చైర్మన్ గుడిపాటి సైదులు, సీనియర్ నాయకులు పోలేపాక రామచంద్రు, పెద్ద బోయిన అజయ్, కొండారాజు, గుండ గాని మహేందర్ గౌడ్, రామచంద్రు, నల్లు రామ చంద్రారెడ్డి, పోడేటి యాదగిరి, చింతకుంట్ల బాబు, జలంధర్, పాల్గొన్నారు.

### భువనగిరి లో..

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** ఆధునిక సాంకేతిక విప్లవానికి ఆద్యుడు, టెలికాం రంగంలో సరికొత్త సంస్కరణలు తెచ్చి భారత దేశాన్ని టెక్నాలజీలో పరుగులు పెట్టించిన ఘనత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీకి దక్కుతుందని పాలకుర్తి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అబ్జర్వర్ పోత్నక్ ప్రమోద్ కుమార్ అన్నారు. రాజీవ్ గాంధీ జయంతిని పురస్కరించుకొని భువనగిరి ప్రభుత్వం ఆస్పత్రిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భువనగిరి మున్సిపల్ టిపిసిసి డెలిగేట్, తంగేళ్లపల్లి రవికుమార్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు కూర వెంకటేష్, రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి పిట్టల బాలరాజు, మాజీ కౌన్సిలర్ ఈరపాక నరసింహా, లాల్ రాజు, పడిగెల ప్రదీప్, రఘు బాబు, దాకూరు ప్రకాష్, యువజన కాంగ్రెస్ నాయకులు ఉపేందర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## తేనెటీగల పెంపకంతో స్వయం ఉపాధి

### కలెక్టర్ ప్రతిమా సింగ్



**ముద్ర ప్రతినిధి, మెదక్:** తేనెటీగల పెంపకంతో స్వయం ఉపాధి కలుగుతుందని కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. గురువారం హవేలీ ఘన్‌పూర్ మండలం బొగడ భూపతిపూర్ గ్రామంలో రైతు జైపాల్ రెడ్డి పొలంలో జిల్లా ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో రైతుల తేనెటీగల పెంపకాన్ని కలెక్టర్ ప్రతిమాసింగ్ పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ... పదిమంది రైతులకు 104 తేనెటీగల పెంపకం బాక్సులు అందజేయడం జరిగిందని 40 శాతం సబ్సిడీ, 60 శాతం లబిదారుల వాటాతో ఈ తేనెటీగల పెంపకం కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు తెలిపారు. జిల్లా ఉద్యానవన శాఖ ప్రోత్సాహకాన్ని ఉపయోగించుకోవాలని చెప్పారు.కొండతెర, కొండిలేని, ఐరోపా, పుట్ట, విసినకర్ర తేనెటీగలు వంటి రకాలు ఆర్థిక ప్రాముఖ్యతను అందిస్తాయని స్పష్టం చేశారు. తేనెటీగల పెంపకం నైపుణ్యత గల పరిపూర్ణ అనే వ్యక్తి ద్వారా సంపూర్ణ అవగాహన చేసుకుని పెంపకంలో మేలుకోలు తెలుసుకుని భవిష్యత్తులో ఆర్థిక అభివృద్ధికి బాటలు వేసుకోవాలని కలెక్టర్ రైతులకు సూచించారు. రైతులు వ్యవసాయ సాగు పంటతోపాటు అనుబంధ రంగాల్లో పట్టు సాధించాలన్నారు. వ్యయసాయ అనుబంధ పద్ధతుల్లో భాగంగా శాస్త్రీయంగా తేనెటీగల పెంపకంపై జిల్లా ఉద్యానవన శాఖ తీసుకుంటున్న చొరవను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ప్రతాప్ సింగ్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి దేవకుమార్, రచన, కీర్తన, రైతులు తదితరులు పాల్గొన్నారడ్రాగన్ ఫ్రూట్ సాగుతో అధిక ఆదాయంహవేలీ ఘనపూర్ మండలం బొగడ భూపతి పూర్ గ్రామంలో రైతు సాగు చేస్తున్న డ్రాగన్ ఫ్రూట్ పంటను కలెక్టర్ ప్రతిమా సింగ్ పరిశీలించారు. బొగడ భూపతిపూర్ రైతు దొమ్మట జైపాల్ రెడ్డి సాగు చేస్తున్న డ్రాగన్ ఫ్రూట్ పంటను పరిశీలించారు. రైతు ఒక ఎకరం విస్తీర్ణంలో డ్రాగన్ ఫ్రూట్‌ను సాగు చేస్తున్న విధానాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి, సాగు వివరాలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా డ్రాగన్ ఫ్రూట్ తోటలో మొక్కల పెరుగుదల, పూత వచ్చే విధానం, పంట దిగుబడి, సాగు ఖర్చులు, మార్కెట్ ధరలు, తదితర అంశాలపై రైతుతో వివరంగా మాట్లాడారు. ఆర్గానిక్ పద్ధతిలో డ్రాగన్ ఫ్రూట్ సాగు చేస్తూ, ఆధునిక సాగు విధానాలను అనుసరిస్తున్న రైతు అనుభవాలను తెలుసుకున్నారు.తక్కువ నీటి వినియోగంతో సాగు చేయగల, అధిక విలువ కలిగిన ప్రత్యామ్నాయ పంటలను రైతులు స్వీకరించేలా వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు.

## చేనేత వస్త్రాలకు క్యూఆర్ కోడ్ తో ప్రత్యేక గుర్తింపు

### జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** చేనేత వస్త్రాలకు క్యూ ఆర్ కోడ్ ద్వారా ప్రత్యేక గుర్తింపు రావాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. గురువారం వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో చేనేత సహకార సంఘాల ప్రతినిధులతో ట్రేడ్ పోచంపల్లి క్యూ ఆర్ కోడ్పై జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పోచంపల్లి చేనేత వస్త్రాలకు దేశ, విదేశాల్లో మరింత గుర్తింపు తీసుకురావడంతో పాటు మార్కెటింగ్ అవకాశాలను పెంచేందుకు క్యూ ఆర్ కోడ్ విధానాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ క్యూ ఆర్ కోడ్ ద్వారా అసలైన చేనేత వస్త్రాలకు ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని, మార్కెట్‌లో నకిలీ వస్త్రాలను అరికట్టేందుకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా సంబంధిత చేనేత వస్త్రం తయారీ విధానం, దాని ప్రత్యేకతలు, వస్త్రాన్ని తయారు చేయడానికి పట్టిన సమయం, అలాగే ఆ వస్త్రాన్ని నేసిన చేనేత కార్మికుడికి సంబంధించిన వివరాలను తెలుసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. పోచంపల్లి చేనేత కళాకారుల నైపుణ్యం, సంప్రదాయ డిజైన్లు, ప్రత్యేకమైన నేసే విధానానికి ప్రపంచవ్యాప్తంగా మరింత ప్రచారం కల్పించేందుకు ఈ విధానం దోహదపడుతుందని కలెక్టర్ అన్నారు. చేనేత సహకార సంఘాలు, నేత కార్మికులు క్యూ ఆర్ కోడ్ విధానాన్ని సమర్థవంతంగా వినియోగించుకొని చేనేత రంగ అభివృద్ధికి సహకరించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో చేనేత జౌళి శాఖ సహాయ సంచాలకులు ఏ . శ్రీనివాస రావు, చేనేత సహకార సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.



## గురుకుల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి



### తెలంగాణ గురుకుల పాఠశాలల కార్యదర్శి ఉషారాణి

**ముద్ర, తుంగతుర్తి:** విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగేలా నాణ్యమైన విద్యను అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని తెలంగాణ గురుకుల పాఠశాలల కార్యదర్శి ఉషారాణి అన్నారు.గురువారం ఆమె తుంగతుర్తిలోని తెలంగాణ గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులకు స్వయంగా పాఠ్యాంశాలు బోధించారు. సమాజంలో ఎలా నేర్చుకోవాలి, లక్ష్య సాధనకు ఎలా ముందుకు వెళ్లాలి, మంచి–చెడు అనే అంశాలపై విద్యార్థులతో మాట్లాడారు.అనంతరం విద్యార్థులకు పెడుతున్న భోజనాన్ని పరిశీలించి, నాణ్యతపై ఆరా తీశారు. సిబ్బందితో సమావేశమై గురుకులలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.గురుకులంలో డార్మెట్రీ, అదనపు గదుల నిర్మాణం, మరుగుదొడ్లు తదితర మౌలిక సదుపాయాల కోసం నిధులు కేటాయించేందుకు తన వంతు ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. గురుకులంలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.ఈ తనిఖీలో డిప్యూటీ కార్యదర్శి వేణుగోపాల్ రెడ్డి, ప్రిన్సిపాల్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## పోచారం అడవికి కొత్త వాహనం ప్రారంభించిన ఎమ్మెల్యే రోహిత్



**ముద్ర ప్రతినిధి, మెదక్:** పోచారం అటవీ ప్రాంతంలో పర్యాటకులను ఆకర్షించడంతో పాటు అడవి అందాలను మరింత సౌకర్యవంతంగా వీక్షించేలా కొత్త వాహనాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ జెండా ఊపి వాహనాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు మాట్లాడుతూ... పోచారం అటవీ ప్రాంతం ప్రకృతి సౌందర్యంతో ఎంతో ప్రత్యేకత కలిగి ఉందని అన్నారు. అటవీ ప్రాంతానికి వచ్చే పర్యాటకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు, ప్రకృతి అందాలను దగ్గరగా వీక్షించే అవకాశం కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.పర్యాటక రంగం అభివృద్ధి చెందితే స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు, పోచారం ప్రాంతానికి మరింత గుర్తింపు లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు అంజనేయులు గౌడ్, మెదక్ మున్సిపల్ చైర్‌పర్సన్ కానుగు రాధిక భూపతి రాజు, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఫీడ్ బజార్ పశువుల దాణా నాణ్య మైనదే



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి:** భువనగిరి మండలం లోని గౌస్ నగర్ గ్రామ రైతు సిరబోయిన మల్లేశం కు చెందిన పాడి గేదలు ఇటీవల మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. రైతు సిరబోయిన మల్లేష్ గేదెలు మృతికి ఫీడ్ బజార్ దాణా తినడం వల్లే చనిపోయాయని అనుమానించి కారణమైన కంపెనీపై పత్రిక ప్రకటనలు చేశారు. ఈ విషయంపై వెటర్నరీ అనిమల్ హస్బండరి డిపార్ట్మెంట్ తెలంగాణ వెటర్నరీ బయాలజీ అండ్ రిచార్జ్ ఇన్స్టిట్యూట్ వారు దాణా శాంపిల్ సేకరించి పరీక్షించగా ఎలాంటి విష పదార్థాలు లేవని తేలిందని రైతు ఒక ప్రకటనలో తెలిపారు. ఆరుబయట మేత కోసం గేదెలు బీర్ వేస్ట్ తినడం వలన చనిపోయి ఉండవచ్చని అనుమానం వ్యక్తపరిచారు.

## పెండింగ్ కేసులను పరిష్కరించేలా దృష్టి సారించాలి

### పోలీస్ కమిషనర్ సునీల్ దత్

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, ఆగస్టు 20 :** సెప్టెంబర్ 12 న జాతీయ లోక్ అదాలత్‌ను దృష్టిలో ఉంచుకుని పోలీస్ స్టేషన్ల పరిధిలో పెండింగ్‌లో ఉన్న రాజీ పడదగిన కేసులను గుర్తించి, సంబంధిత పక్షాలతో సమన్వయం చేసుకుంటూ త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పోలీస్ అధికారులను ఆదేశించారు. పోలీస్ అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫిరెన్స్ లో పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ లోక్ అదాలత్ ద్వారా కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులతో పాటు రాజీకి అవకాశం ఉన్న కేసులను ఇరుపక్షాల సమ్మతితో స్నేహపూర్వకంగా పరిష్కరించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. పోలీస్ అధికారులు తమ పరిధిలోని కేసులను సమీక్షించి, లోక్ అదాలత్‌కు పంపించేందుకు అర్హత ఉన్న కేసులను గుర్తించాలని సూచించారు. సంబంధిత ఫిర్యాదు దారులు, నిందితులు మరియు ఇతర పక్షాలకు లోక్ అదాలత్ ద్వారా కేసుల పరిష్కారం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. పెండింగ్ కేసుల పరిష్కారంలో న్యాయ సేవా సంస్థలతో సమన్వయం చేసుకుంటూ, నిర్దేశించిన లక్ష్యాలను సాధించేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని పోలీస్ కమిషనర్ సూచించారు.కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ రామానుజం, ఏసీపీ మహేష్, నరసింహారావు, సిఐ సర్వయ్య పాల్గొన్నారు.

## ప్రిన్సిపాల్ రూపారెడ్డి హత్యను ఖండించిన ట్రాస్మా

### ముక్తకంఠంతో ఖండించిన ట్రస్మా

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** ప్రిన్సిపల్ రూపారెడ్డి హత్య సభ్య సమాజం తలదించుకోవాల్సిన ఘటన అని ట్రస్మాము క్తకంఠంతో ఖండించింది. గురువారం భువనగిరి పట్టణంలోని మదర్ తెరిసా స్కూల్ లో రూపారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ట్రస్మా జిల్లా అధ్యక్షుడు పాలకూర వెంకటేశం గౌడ్ మాట్లాడుతూ నేటి సమాజంలో విద్యాబుద్ధులు నేర్పించి తల్లిదండ్రుల తర్వాత తల్లిలాగా జీవితంలో ఉన్నత స్థితికి చేరుకోవడానికి తప్పు ప్రవర్తన ఉన్నవారిని మందలించినందుకు ఆమెను అతి కిరాతకంగా చంపినందుకు సభ్య సమాజం తలదించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సమాజంలో ఉపాధ్యాయులకు రక్షణ లేకుంటే, దేశ భవిష్యత్తు తీర్చిదిద్దే వాళ్ళు ఎవరన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు గాదె సోమిరెడ్డి, జిల్లా కార్యదర్శి వంగూరు పాండు, తుంగతుర్తి రంగారావు, దుర్గాప్రసాద్, చిన్నను సురేష్, తోటకూర యాదయ్య, రఘు అఖిలప్రియ కరస్పాండెంట్స్ పాల్గొన్నారు.

## పెండింగ్ కేసులను త్వరగా పూర్తి చేయాలి

### జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్




**ముద్ర, దేవరకొండ:** నల్లగొండ జిల్లా పోలీస్ శాఖలో పరిపాలనా పనితీరు, కేసుల దర్యాప్తు పురోగతి రికార్డుల నిర్వహణశాంతిభద్రతల పరిరక్షణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించిన జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ గారు వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం దేవరకొండ డీఎస్పీ కార్యాలయం మరియు డిండి సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయాలను తనిఖీ చేశారుఈ సందర్భంగా కార్యాలయాల్లోని వివిధ రికార్డులు, కేసుల దర్యాప్తు వివరాలు, పెండింగ్ కేసుల ఫైల్స్, క్రైమ్ రికార్డులు, పరిపాలనా రికార్డులను ఎస్పీ క్షుణ్ణంగా పరిశీలించారు.ప్రత్యేకంగా గ్రేవ్ కేసులకు సంబంధించిన క్రైమ్ ఫైల్స్, పెండింగ్ కేసుల రికార్డులు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల ఫైల్స్‌ను సవివరంగా పరిశీలించిన ఎస్పీ, ప్రతి కేసులో దర్యాప్తు ఏ దశలో ఉంది, ఇప్పటివరకు సేకరించిన ఆధారాలు, నిందితుల అరెస్టు, చార్జ్‌షీట్ దాఖలు తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు సత్వర న్యాయం అందేలా కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని ఆదేశించారు.నిందితులకు చట్టపరంగా శిక్ష పడే విధంగా దర్యాప్తు అధికారులు అన్ని కోణాల్లో దర్యాప్తు నిర్వహించాలని ఎస్పీ స్పష్టం చేశారు. కేవలం కేసును ఛేదించడం మాత్రమే కాకుండా, కోర్టులో నేరం రుజువయ్యేలా నాణ్యమైన దర్యాప్తు, పటిష్టమైన సాక్ష్యాధారాల సేకరణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, తమ పరిధిలోని సమస్యాత్మక ప్రాంతాలు, నేర ప్రభావిత ప్రాంతాలు, సున్నితమైన ప్రాంతాలపై ప్రత్యేక నిఘా కొనసాగించాలని ఎస్పీ సూచించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా, వాటిని వెంటనే పరిశీలించి చట్టపరమైన పరిష్కారం చూపాలని ఆదేశించారు.ఈ వార్షిక తనిఖీలో దేవరకొండ డీఎస్పీ శ్రీనివాసరావు, డిండి సీఐ బిసన్న, ఇతర పోలీస్ అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థుల పెంపకంలో తల్లిదండ్రులదే పూర్తి బాధ్యత

### రూపా రెడ్డి హత్య నిరసిస్తూ నేడు రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలల బందుకు పిలుపు

**ముద్ర, దేవరకొండ:**నల్గొండ జిల్లా కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని నాగార్జున గ్రామర్ కాన్సెప్ట్ స్కూల్ ప్రిన్సిపల్ కల్లు రూపారెడ్డి దారుణ హత్య నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యాయ సంఘాలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశాయి. ట్రస్మా ఆధ్వర్యంలో రూపారెడ్డి సంతాప సభను నిర్వహించారు. అనంతరం తెలంగాణ రికగ్నైజడ్ స్కూల్ మేనేజ్మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు నిమిషాలు మౌనం పాటించి ప్రిన్సిపాల్ రూపారెడ్డికి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ట్రస్మా రాష్ట్ర నాయకులు యానాల ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ సభ్య సమాజం సిగ్గుపడేలా 28 ఏళ్ల నుండి పాఠశాల ప్రిన్సిపాల్ గా డైరెక్టర్ గా విద్యార్థులకు పాఠాలు నేర్పుతున్న రూపరెడ్డిని అదే పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు అతి కిరాతకంగా చంపడం హేయమైన చర్య అని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రాష్ట్ర ప్రైవేట్ పాఠశాల యాజమాన్యానికి, రాష్ట్ర ప్రైవేట్ టీచర్లకు సంపూర్ణమైన భద్రత కల్పించాలన్నారు. సమాజంలో జరుగుతున్న ఘోరాలను ప్రజలు బాధ్యతతో వ్యవహరించాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను క్రమశిక్షణతో పెంచాలన్నారు. పాఠశాలలో చదువుకుంటున్న పిల్లలను సోషల్ మీడియా, ఫోన్ల వాడకం, వారి చుట్టూ ఉన్న పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలన్నారు. ముఖ్యంగా చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ బాధ్యతతో పిల్లలను పోషించాలన్నారు. ఇలా ప్రతి దానిపై నిఘా పెట్టకపోతే జరిగే ప్రతి అనర్ధంలోనూ తల్లిదండ్రులు కూడా భాగస్వాములు అవుతారనే విషయాన్ని మర్చిపోవద్దని తల్లిదండ్రుల బాధ్యతలను గుర్తు చేశారు. నిషేధిత మత్తు పదార్థాలైన గంజాయి సేవించడం సమాజానికి ఎంతో ప్రమాదకరమన్నారు. గంజాయిపై ఉక్కు పాదం మోపాలని గంజాయిని నిషేధించడానికి సమాజంలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. అనంతరం రూపారెడ్డి సంస్మరణ సభలో స్థానిక సర్పంచుతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా వచ్చిన రాష్ట్ర ప్రైవేట్ స్కూల్ యాజమాన్యంతో పాటు ప్రముఖులు వారి సంతాపాన్ని తెలిపారు. కల్లూరు రూపారెడ్డి సంతాప సభ అనంతరం రూపారెడ్డి హత్యను నిరసిస్తూ ట్రస్మా ఆధ్వర్యంలో శుక్రవారం రోజు రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేట్ పాఠశాలల బందుకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా జిల్లా అధ్యక్షులు కోడి శ్రీనివాసులు, మెరుగు మధు, ట్రస్మా మండల అధ్యక్షుడు కట్టా వెంకట్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, ఆనంద్ రెడ్డి, జాజి రెడ్డి, రాణిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి,వివిధ పాఠశాలల ప్రిన్సిపల్స్, టీచర్లు, వివిధ పార్టీల ముఖ్య నాయకులు, విద్యార్థి సంఘాల నేతలు, పట్టణ ప్రజలు పలువురు ప్రముఖులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.






Printed, Published and owned by Aliminati Indra Reddy Printed at M/s. Kakatiya Printers, 2-24-96/6, Plot No. 26 & 27, L.N. Colony, New IDA, Uppal, Hyderabad500039, Medchal Malkajgiri Dist., Telangana and Published from H.No.7-32/B, Flat No. 202, Sri Sai Heights, Sri Sai Nagar, Street No. 8, Hasbiguda, Medchal Malkajgiri District, Hyderabad 500007, Editor: Y Narender Reddy, RNI. Reg. No.TELTEL/2013/50413. e mail: mudradaily@gmail.com, Cell 9949193555